[illegible] - [illegible]. [illegible]

సంపుటము-8
సంచిక-3

శ్రీ

చింతామణి.

ఇది మాసమున కొకసారి ప్రకటింపఁబడును.

సంపుటము ౮. | చెన్నపురి: విళంబి సంవత్సర భాద్రపద మాసము. | సంచిక ౩.

హిందూదేశముయొక్క మిత్రులు శత్రులు.

[ఇది ప్రోగ్రెస్ (Progress) పత్రికనుండి సంక్షేపించి వ్రాయఁబడినది.]

ఇహలోకజీవనములోఁగల యమూల్యములైన లాభములలో వివేకియగుసన్మిత్రుఁ డొకఁడు. మిత్రులలోఁ గలయన్యోన్యవశీకరణప్రభావము లోకప్రసిద్ధ మయినది. "నీసహవాసులను జెప్పు, నీ వెట్టివాఁడవో నేను చెప్పెదను" అను సామెత లోకములో వెలసియున్నది. "బుద్ధిమంతులతోఁ దిరుగువాఁడు బుద్ధిమంతుఁడగును; బుద్ధిహీనులతోఁ జరించువాఁడు చెడిపోవును." అని సాలోమాను చెప్పియున్నాఁడు. మన ముఖ్యస్నేహితులు మంచివారయినపక్షమున, మనలను వారు సమస్తసత్కార్యములయందును బ్రోత్సాహపఱిచి, దుష్కార్యములయందు నిరుత్సాహులను జేయుదురు. అందువలన ధర్మమునకు మహావలంబము కలుగును. ఇట్లుగాక ముఖస్తుతులవలన మనలను సంతోషపెట్టుటకుఁ బ్రయత్నించువారుగాని, మన దుష్కార్యమును హేతుకల్పనముచేసి న్యాయమని చూపువారుగాని, పయికి మిత్రులుగాఁ గానఁబడుచున్నను నిజముగా మనకు గర్భశత్రువులు. అసన్మిత్రులకును సన్మిత్రులకును గలభేదమును గ్రహించుట ముఖ్యకర్తవ్యము. వారికిఁ గలభేదమును దెలిసికొనుటకయి యీక్రిందఁ జెప్పఁబోవునవి కొన్ని యాధారములుగా నుండును. ఇవి ప్రత్యేకమనుష్యులవిషయమున నెట్లో యట్లే జనసంఘములవిషయమునను బనికివచ్చును.

౧. కపటమిత్రులు ముఖస్తుతులు చేయుదురు; నిజమైన మిత్రులు అప్రియములయినసత్యములను జెప్పుదురు.—స్వభావముచేత ముఖస్తుతు లందఱికిని ప్రియములే యైనను, హిందువులయం దీదౌర్బల్య మత్యధికముగా ప్రబలియున్నది. "మహారాజ" యనునది గౌరవార్థముగా సామాన్యజనుల నుద్దేశించికూడఁ జెప్పఁబడుచున్నది. వివాహములయందలి విత్తవ్యయము తఱచుగా ముఖస్తుతులమీఁది యాశచేతనే సంభవించుచున్నది. యోగ్యతయున్నప్పుడు శ్లాఘించుట న్యాయమేయైనను, యోగ్యత లేనప్పుడు చేయు శ్లాఘన లబద్ధముల కన్నదమ్ము లగుచున్నవి ఒకరింకొకరితో తగవు

పెట్టుకొన్నప్పుడు, కపటమిత్రుఁడు దానికామోదించి యాతని కపుడు విడువక కడసాగింప వలెనని పురికొల్పును. నిజమైనస్నేహితుఁడు తనమిత్రునియెడ తప్పిద మేమాత్ర మున్నను స్పష్టముగాఁజెప్పి సంధి చేసికొన బోధించును. ఒకఁడు సురాపానమును మరిగినయెడల, కపటమిత్రుఁడు మాటాడక యూరకుండును; నిజమైనమిత్రుఁడు బుద్ధి చెప్పి వలదని వారించును. ఇట్లు హితబోధ చేయుట నిజమైనమిత్రునకు పరమధర్మము.

2. కపటమిత్రులు జనానురాగమును గోరుదురు; నిజమైనమిత్రులు అవస్తుతి నైనను సహించుటకు సంసిద్ధు లయియుందురు. గాలి యేవైపునకుఁ గొట్టునో యావైపున కొరగుచుండుట కపటమిత్రుల లక్షణము. సాధారణముగా హిందువులు మూర్ఖులును మూఢభక్తి గలవారు నయి మతోన్మాదులగు కులగురువులచే నడపఁబడువా రగుటచేత, వారియనుగ్రహమును సంపాదింపఁ గోరువారు తమయభిప్రాయములు వారియభిప్రాయములతో నేకీభవించినట్లు నటించుచు వారి కిష్టమయిన పక్షము నే యవలంబించు చుండ వలెను. అందుచేత మౌఢ్యముయొక్క యధికారము స్థిరపడు చుండును. నిజమైనస్నేహితుఁడు తాను హితోపదేశము చేయనుద్దేశించినమిత్రున కేది యింపుగా నుండునా యన్న యాలోచనను జేయక యేది మేలుచేయునదిగా నుండునా యనియే చూచు చుండును. అందువలన నతనికి మెప్పు లేకపోవుటయేకాక తిట్లు సహితము సంభవింప వచ్చును. అయినను, అట్టివాఁడు స్వకర్తవ్యమును నిర్వహించిన వాఁడయి, అంతరాత్మయొక్కయు నీశ్వరునియొక్కయు బ్రీతిని బడయును. హిత బోధ నెప్పుడును విరసముగాఁ జేయక చల్లనిమాటలతోఁ జేయుచుండవలెను.

3. కపటమిత్రులు సదా హిందూదేశముయొక్క పూర్వపుగొప్పతనమును పొగడు చుందురు; నిజమైనమిత్రు లిప్పటిలోపములను సంస్కరింపఁ జూచు చుందురు.—పూర్వులయందు యుక్తగౌరవ ముంచుట శ్లాఘ్యమే. రెండు వేలసంవత్సరముల క్రిందట హిందువు లప్పటివారిలో నెక్కువనాగరికత గలవారుగా నుండిరి; ఆ కాలమునం దింగ్లీషువారు రంగులు వేసికొనుమృగప్రాయులకంటె నెంతో యధికులుగా నుండలేదు. హిందూదేశముయొక్క పూర్వస్థితినిగూర్చి మహాభారతాదులవలన జనులు గ్రహించినయంశము లతిశయోక్తులుగా నున్నవి.........పూర్వకాలపువారు మహాబుద్ధిమంతు లనియు జ్ఞానవృద్ధులనియు నిప్పటివా రల్పజ్ఞులు శిశుప్రాయులు ననియు జనులలోఁ గలయభిప్రాయము సత్యము కాదు. వెనుకటితరమువారికంటెఁ దరువాతితరమువారు జ్ఞానాధికు లగుచుండుట నైసర్గికధర్మము. మహాభారతకాల మునకంటె నీకాలము వేలకొలఁదిసంవత్సరములు వయసుచెల్లినదిగా నున్నది. పెద్ద పెరిఁగినకొలఁది నొకపురుషుఁడు తనబాల్యములో నున్నదానికంటె జ్ఞానాధికుఁడు కాకపోవుట సిగ్గులచేటుకదా! ఆప్రకారముగానే జనసంఘమును ప్రపంచముయొక్క బాల్యదశయైన పూర్వకాలమునకంటె వయసుచెల్లిన యీకాలమునం దధికజ్ఞానసం పన్నము కాకుండుట యసహజమయి యవమానకరమయి యుండుననుటకు సందేహము లేదు. సర్వవిషయములలోను పూర్వాచారమున కవిరుద్ధముగా నడవవలె నన్నపట్టుదల చేతనే యీహిందూదేశ మంతగా నభివృద్ధి నొందక పూర్వకాలపుటర్ధనాగరికతయందే

స్థిరముగా నిలిచియున్నది. కాలక్రమమున సమయోచితముగా మంచిమార్పులను జేసికొనుచు వచ్చుచుండుటచేతఁ బూర్వకాలమున హిందువులకంటె నెంతో తక్కువ స్థితిలో నున్నయింగ్లీషువా రిప్పుడు హిందువులనుమించి నాగరికాగ్రగణ్యులయి ప్రపంచములో మహోన్నతస్థితి నొందియున్నారు. అయినను హిందువులలో ననేకులు పూర్వకాలముపై నతిగౌరవ ముంచుటవలనఁ గలుగుచున్న యనర్థములను దెలిసికొని తమలోపములను దిద్దుకొనుటకై హృదయపూర్వకముగాఁ బ్రయత్నించు చుండుటయు, అట్టివారిసంఖ్య నానాటికి వృద్ధినొందు చుండుటయు, సంతోషకరముగానున్నది.

౪. కపటమిత్రు లాలోచన లేక దేశాచారము ననుసరించు చుందురు; నిజమైనమిత్రులు తమబుద్ధి నుపయోగించి యావశ్యకమైనప్పుడు నూతనమార్గముల నడపుచుందురు.—స్వదేశసదాచారములను సర్వవిధములచేతను గాపాడుచుండవలెను; ఉదాసీనము లయినవిషయములలో సహితము సాధ్యమైనంతవఱకు పూర్వాచారముల ననుసరించు చుండుటయే మంచిది. అయినను ప్రతిమనుష్యుఁడును తనదురభ్యాసములను వదలుటకుఁ బ్రయత్నింపవలసినట్లే జనసంఘము సహితము దుష్టము లయినపూర్వాచారములను త్యజించి బాగుపడుటకయి పాటుపడుచుండ వలెను. పూర్వదురాచారములను సంస్కరించుటకయి యెవ్వరో యొక రారంభింపవలెను. ఈవిషయమున ఆనరబిల్ చంద్రవర్కర్ గా రిట్లు వ్రాసియున్నారు.—

"విద్యాధికునియొక్క ధర్మము తాను ప్రతినిధిగా నుండి జనసామాన్యముయొక్క యభిప్రాయమును దెలుపుటమాత్రమే యని తలఁచు చుండువారు కొందఱు గలరు; ఇంతకంటె దుష్టమయినయభిప్రాయ మింకొకటి యుండదు. హిందూదేశమందలి జ్ఞానతేజస్సును బొందినవిద్యావిశారదులు తామా తేజస్సును దేశమున వ్యాపింపఁ జేయక పోయినపక్షమునను, జనులచే నాయకులని యెంచఁబడుటకయి తాము జనుల ననుసరించువా రయినపక్షమునను, ఇఁక జనులకు జ్ఞానోపదేశము చేసి వారిని నడపించువా రెవ్వరు! మిల్లుదొరవారును మెయిన్ దొరవారును చెప్పినట్లును దేశచరిత్రము చూపినట్లును సంస్కారము లెల్లప్పుడును అల్పసంఖ్యాకులచేతనే చేయఁబడుచు వచ్చిన వన్నసత్యమును మఱచియుందురు. విద్యాధికునియొక్క ధర్మము జనులలో సద్విషయములయందు నూతనాభిప్రాయములను కలిగించుచుండుట గాని యున్నయభిప్రాయములను వెల్లడించుచుండుట కాదు. నిజమైన గొప్పతనమును నిజమైనప్రతిష్ఠయు కార్యదక్షతలో నుండునుగాని, జనులు తమ్ము నాయకులనుగా భావింతురని వా రట్లభిప్రాయపడు చుందురో యట్లు మాటాడు చుండుటలోను వారి యాచారములను బొగడు చుండుటలోను వారిపంథ నవలంబించుటలోను ఉండవు."

౫. కపటమిత్రులు సంస్కారముల నెల్లప్పుడును కాలాంతరమునఁ జేయవలెనని జరపుచుందురు; నిజమైనమిత్రులు వెంటనే కార్యమునకుఁ జొరవలెనని ప్రోత్సాహపఱుచు చుందురు.—సంపూర్ణవిద్యావంతుఁ డెవ్వఁడును మంచివని సాధింపలేని విస్పష్టములైనదురభిప్రాయములును దురాచారములును హిందూదేశములోఁ గొన్ని గలవు. ఐనను చదువుకొన్నవారనేకులు మూఢులును దురభిమానదూషితులునయినస్వదేశస్థులకు విరోధ

ముగా నేకార్యమునైనను జేసి వారియనురాగమును బోఁగొట్టుకొనుటకిష్టములేనివారుగా నున్నారు. అట్టివారు మార్పు లావశ్యకములని యొప్పుకొనియు ,,కార్యమున కింకను కాలమురాలే"దని చెప్పుచుందురు. ఏయుద్యమమైనను సఫలమగుటకు ముందుగా ప్రథమ సాధనములను గొన్నిటిని జేయవలసి యుండును. ఇట్టి మిత్రుల విషయమున సూరతు నగరవాసియగు ఆర్-ఎస్- బాయిగారిట్లు చెప్పుచున్నారు.—

,,స్వదేశస్థులలో నింకొక తెగవారు సాంఘికలోపముల నొప్పుకొని, దూరదృష్టినిగూర్చి యుక్తి కల్పనలతో హితోపదేశములు చేయుచు నింగ్లీషు గ్రంథములనుండియు శాస్త్రములనుండియు వాక్యముల నుదాహరించుచుందురు. ఈదోషములు వేలకొలఁది సంవత్సరములనుండి యున్న యాచార్య ప్రాబల్యమువలనను మూఢత్వమువలనను వచ్చియున్నవనియు, వానిని మాన్పుటయసాధ్యమనియు, చులుకైన కార్యములవలనఁ బ్రయోజనము లేదనియు, వానిని కాలక్రమమున విద్యాభివృద్ధివలన బాగుపడుటకు విడిచిపెట్టి రాజ్యాంగ విషయములలో పనిచేయ వలయుననియు, సాహసిక కార్యములు చేసినయెడల జనులలో కలఁత కలుగుననియు, అట్టివారు బోధించుచుందురు. ఎటువంటి పనికిమాలిన విషయములలో నైనను యుక్తులకుకొదవయుండదు. విద్యాధికులుగను చెల్లుబడిగలవారును నయినపక్షమున నిటువంటిమిత్రు లాఱుగురుచేయు హానియే సంస్కారవిషయమున నూఱుగురు బిచ్చపుబ్రాహ్మణులు చేరి చేయుహానికంటె నెక్కువగానుండునని నేను స్వానుభవముచేత దృఢముగాఁ జెప్పఁగలను. ఏజాతియైనను సత్కార్యములకుఁ బూనుటకు సాహసములేక దూరదృష్టిని గూర్చిన హితబోధలతోను శాస్త్రోదాహరణములతోను తృప్తిపొందెడు నాయకులను మాత్రమే పుట్టింపఁగలిగిన యెడల, ఆజాతికి బాగుపడుట కాశయుండదు."

౨. కపటమిత్రులు స్వకార్యమును సాధించుకొనుట కెట్టి సాధనములనైన నుపయోగింతురు, నిజమైన మిత్రులు సత్యమును న్యాయమును మాత్రమే యవలంబింతురు.—కపట మిత్రులు హేత్వాభాసములకును మిథ్యావాదములకును వెనుకతీయరు; అసత్యములని తా మెఱిఁగినసంగతులను స్థాపించుటకయి యుక్తికల్పనలను జేయుదురు; దేశమున కనర్థదాయకములని తాము హృదయపూర్వకముగా నమ్మిన యాచారములు మంచివని సమర్థింపఁజూతురు; తమ ప్రతిపక్షుల విషయమున లోక ప్రవాదములను విచారణలేక నమ్ముటయేకాక కేవలాసత్యములకును సంశయింపరు; యుక్తులు పనికిరానప్పుడు దౌర్జన్యమునకుఁ జొత్తురు. సత్యమైనమిత్రులు సదభిప్రాయములను వ్యాపింపఁ జేయఁజూతురు; నిజమైనయుక్తులను జూపి కార్యములను వారివారిబుద్ధికి విడుతురు; వంచనము దేశమున కపాయకరమని యెఱిఁగి దానిపొంతకుఁ బోరు; సత్యమును న్యాయమును కానిది దేశమున శుభకరము కాదని దానిని నిరసింతురు.

౩. కపటమిత్రులు జాతిద్వేషమును పురికొల్పుదురు; నిజమయిన మిత్రు లెల్లవారిలోను సోదరభావమును పెంపొందింపఁ జూతురు.— * * *

జాతిమత ద్వేషములను పురికొల్పుటను మించినయనర్థమును, పరస్పర సోదరభావమును ప్రోత్సాహపఱుచుటను మించిన శ్రేయస్సును, దేశమున కింకొకటిలేదు. * * *

35. పెద్దవీధికిఁ బైగా 100 గజముల వఱకు వంకర టింకర రాళ్ళతోఁ గట్టఁబడిన కాలిదారి యున్నది. దాని యిరుప్రక్కలఁ గోడగుట్ట లున్నవి. తుంగభద్ర రాతిస్థలముమీఁద మెల్లఁగాఁ బ్రాఁకుచున్నట్టు గనఁబడును. పై నుడివిన దారి 'శ్రీ కోదండరామస్వామి,' 'యంత్రోద్ధారక' దేవాలయములకు వెళ్ళును. సీతా రామ లక్ష్మణ విగ్రహములు రమణీయముగ నున్నవి. అక్కడి తీర్థము చక్రతీర్థమని శ్రీపంపామాహాత్మ్యములో నున్నది. యంత్రోద్ధారకాలయ మెత్తుగ మెట్లపై నున్నది. అందు శ్రీఆంజనేయులవిగ్రహమును శ్రీనరహరితీర్థు లను ద్వైతాచార్యులు స్వహస్తమున రాతిమీద లిఖించి రని నుడువుదురు. మఱియు శ్రీమధ్వాచార్యులవారి విగ్రహముగూడ నాగుడియం దున్నది. దానికి సమీపముననే యెత్తుగ లక్ష్మీనరసింహస్వామికోవెల యున్నది. దానికిఁ దూర్పునఁ జాల నెత్తున మతంగాద్రిశిఖరమున గుడి యున్నది. అక్కడినుండి చూచిన శ్రీవిద్యానగరము, తుంగభద్ర, పంపాసరోవరము, శ్రీవిరూపాక్షాది దేవాలయములు, పొలములు, శాఖామృగములు, చక్కఁగఁ గానుపించును.

36. ఆమతంగాద్రిక్రింద 'అచ్యుతస్వామి' ఆలయము పెద్దదియున్నది. దాని కెదురుగ ముప్పాతిక మైలు పొడవునఁ బెద్దబాజా రున్నది. ఇది హంపికి సూటిగఁ దూర్పున నున్నది. ఈయాలయము కృష్ణస్వామి కోవెలకు నకలుగ నున్నది. ఉత్తర దక్షిణముల నున్నది. ముఖ్యగోపురమున కెదురుగఁ బాడుపడిన బాజా రున్నది. దానిలో నాగుడి భోగమువాండ్రుండిరఁట. ఉత్తరగోపురముల రెంటిలోను కన్నడ శాసనము లున్నవి.

37. ఈదేవాలయముఖమున నున్న రాతిరోడ్డుమీఁదఁ బడమర వైపున నున్న గుళ్ళను దాటి నదియొద్దునఁ బోఁగా, సీతాదేవిగుహ, కొలను కనఁబడును. దాని సమీపమున రాయి బద్దలయి నటుల సహజచిహ్నము గానఁబడును. సీత బట్టను రాయఁగ నైనదని చెప్పుదురు. ఇవి ఐతిహ్యము లయినను, ఈప్రత్యభిజ్ఞలవలన సీతారామకథ జ్ఞప్తికివచ్చి వారి స్మరణకీర్తనములు చేయనగు.

38. అక్కడినుండి రాతిరోడ్డుగుండ పోఁగా శిలాస్తంభములతోఁ జేయఁబడిన తులాభారము గానవచ్చును. దానియందు విజయనగరప్రభువులు, ఇప్పటి ట్రావెన్ కూరుమహారాజులవలె, తమ రొకత్రాసున, రెండవదానిలో వెండి, బంగారము, ముత్యములు, రవలు వేసి తూగి, యాద్రవ్యములను సత్పాత్రులకు దాన మొసఁగిరఁట. షష్టివర్షంబులు పూర్తి యయినపుడు, పుట్టినదినమునఁగూడ నట్టిమహోత్సవముఁ జేసియుందురు.

39. అక్కడినుండి కాలిదారినిఁ బోఁగా హంపీదేవళముల నన్నిటిలో మేరు పూనయగు శ్రీ విఠలేశ్వ రాలయ మున్నది. అది శ్రీవిద్యానగరపు పూర్వదిశను, తుంగ

భద్రానది యొడ్డున ఉన్నది. దానికిఁ దూర్పున 'తలవారికట్ట' యను గ్రామమువఱకు రాతితో, చప్టాలు చేయఁబడిన విశాలమయిన రోడ్డు మైలువఱకు వ్యాపించినది. ఇప్పుడు అది నిర్జనముగ నున్నది. దాని యెడమప్రక్కను నలుచదర పుటాకారమయిన తెప్పకొల నమరియున్నది. గుడి కెదురుగ నొక పెద్ద ధ్వజస్తంభము, దానిపైని ఇనుప అర్ధచంద్రాకారపు రేకు ఉన్నది. రేకు నూతనపుదిగ నగుపడును. బహిః ప్రాకారముల మధ్యను మూడువైపుల నిడుపుగల గోపురము లున్నవి. దక్షిణద్వార గోపురము బహు శిథిలముగ నుండఁగ నిప్పటి మదరాసు ప్రెసిడెన్సీ గవర్నరుగారి యనుగ్రహమువలన దానికిని, మఱికొన్ని లోపలిస్థలములకును, మరమ్మతులు జరిగినవి. వీనికి హేతువులు ఆదేవాలయములోని విజాతీయమైన శిల్పపుఁబని సర్కారువారికిఁ గల విద్యాభిమానము. సింహద్వారము పూర్వపుదిశనున్నది. దానిలోఁ బ్రవేశింపఁగ నెట్టెదుట గర్భాలయము, దాని యిరుప్రక్కల నందుమంటపములు గానుపించు. ప్రాకారములోపల శిలామయము లయినచక్రములు, ఇరుసులు, గలరాతి తేరు ఉన్నది. ఆరథముచుట్టు స్త్రీలు చిలుకల నెక్కి చిలుకలు లాగు తేరులను నడిపించుచున్నటులఁ జెక్కఁబడి యింపుగ ముద్దులు మూటలుగట్టుచున్నవి. ముఖమంటపమునకు రాతిమెట్లు గలమూడుమార్గము లున్నవి. దాని కప్పుపైనిఁ జేసినపని మన ప్రాచీనశిల్పవిజ్ఞానమును బహువిధములఁ బ్రకటముఁ జేయుచున్నది ఒక్కొక్క రాతిస్తంభములో 16 చిన్న స్తంభములవఱకుఁ జెక్కి సింహ వ్యాఘ్రాది పురాణపాంచరాత్ర ప్రసిద్ధ విగ్రహములు జీవితప్రతిమలవలె నేటికిఁ గనఁబడును. పార్శ్వద్వయముల నందుమంటపములలోఁ గూడ ప్రతిమలు సుందరముగ నొక్కరాతిలో నానావిధములుగ నాగమ విహితముగఁ జెక్కఁబడి యున్నవి. కల్యాణమంటపము నెదురుగ నుండి చూచినఁ గడువింతగఁ దోచును. దానిలోని యూపనివానితన మితర దక్షిణహిందూస్థాన దేవాలయములలో నున్నదనుట సాహసము. ప్రతిమలతోఁ జెక్కఁబడిన స్తంభములు మధురాది మహాస్థలములలోఁగూడ లేవు. గుడి కప్పుచూరులుగూడ రాతివే. వానికోణములుగూడ కొమ్ముల పక్ష్యాలవలె రాళ్ళతోఁ జేయఁబడెను. దరుజాగాని, కొయ్యగాని, మేకుగాని, లేకుండ నింత సాపుపనితోఁ గలరాళ్ళతో నింతగొప్పగుడిగట్టుట బహు శ్లాఘనీయము ఆకోణములలో నొక్కమర్కటము కూర్చుండినటులఁ జెక్కఁబడినది. దీపము నుంచుగ్లోబులు మొదలగువానిని దగిలించుటకు రాతిగొలుసులు చూరులలో వ్రేలాడుచున్నవి. సదాశివరాయని దానమును సూచించు క్రీ॥ శ॥ 1561 వ సంవత్సరము శాసన మొకటి కలదు. ఈరమణీయమయిన దేవాలయము శోచనీయమయిన దురవస్థలలో నున్నది. లోపలి చప్టాయూవత్తు ద్రవ్యమున్నదని భ్రాంతిచే త్రవ్వఁబడి యున్నది. మునలమానులచే గర్భాలయద్వారముల నున్న చక్కనిగజప్రతిమల తొండ

ములు వరకఁబడి యున్నవి. గర్భాలయముచుట్టు తుంగభద్రానది జలమువచ్చు కౌలి ఖానా (తూము) ఇప్పటికి నున్నది.

40. వదలలేకున్నను విఠలేశ్వరాలయమును విచారముతో వదలి నాలుగడుగులు నడువఁగా దాని కెదురుగ నున్న రాతిబందోబస్తుగల విశాలమయినమార్గమును ప్రవేశించినచో నిరుప్రక్కల రాతిస్తంభముల నధిరోహించినమంటపములను జూడవచ్చును. ఆమార్గము కొండలనందున వంకరగ వెళ్లును. ఒకదానిమీఁద నొకటి పేర్చియున్నటులఁ గనఁబడు సహజము లగురాతిగుట్ట లమితములు. మఱియుఁ బాడుపడిన గ్రామపు పాటి దిబ్బలు విశేషముగ నున్నవి. కొంతదూరము పోఁగా, 'కంపిలి' యను గ్రామమునకుఁ బోవురోడ్డు. దాని యెడమప్రక్కను మిట్టమీఁద చాలనెత్తుగా మాల్యవంత రఘునాథుని దేవళము కలదు. చతుష్కోణములు గలప్రాకారము లున్నవి. వానిమధ్య విమానము మంటపములు ఉన్నవి తక్కినగుళ్లలో వలె మోటుపని లేక హజారు రామస్వామి కోవెలలోవలె నాజూకు రాతిపని గలిగి యున్నది. బహిఃప్రాకార కుడ్యములందు తిమి తిమింగలములు లోనుగాఁగల పెద్ద సాముద్రప్రతిమలు సుందరముగఁ జెక్కఁబడినవి. ఒకచోట బాటసారుల సార్థమును దినుటకుఁ బొంచియున్న మొసలి విగ్రహ మున్నది. ఆదేవళములో రామస్వామివిగ్రహ మున్నది. అక్కడ శ్రీరామచంద్రులు వాలి వధానంతరము సీతావియోగమున సుగ్రీవసహాయముకొఱకుఁ గొన్ని మాసములు వేచుచు వగచుచుండి రని గాథ. ఆరామచంద్రులవిగ్రహమును బైరాగులు పూజించు చున్నారు.

41. మాల్యవంతమును వదిలి మనముదిగిన కామలాపురపు బంగళాకుఁ బోవలెను. దారిలో రోడ్డున కెడమప్రక్క కామలాపురమునకుఁ బావుమైలులో నొకగుడి పాడుపడి యున్నది. కొండలోఁ జెక్కినరాతిధ్వజస్తంభము చాల నెత్తుగలది యున్నది. దానిమీఁద నున్నప్రాఁతకన్నడ శాసనము హరిహరరాయలు లాగుడిని క్రీ॥ శ॥ 14వ శతాబ్దములోఁ గట్టినటు పలుకు చున్నది. హరిహరుఁడు జైన వైదికమతస్థులకు సంధిఁ జేసియుండ నోపు. రోడ్డునకుఁ గుడిచేతివైపునఁ గొన్నివందలగజములు పోఁగా నొకరాఁతిలోఁ జెక్కఁబడినగుడి యున్నది. దాని పేరు 'ఒంటిగుండిన వడశాలా.' అది పెద్ద కూటముపాఱిడివలె నున్నది. మహాబలిపురములో నున్నగుహలు, గుళ్లు, రాతిపనులయుండఁ నివి యల్పములు. ఈకూటమును జేరి స్నానగృహ ముండెను. అది చెడినది. శ్రీవిద్యానగరపు శిథిలము లయినకోటబురుజులను దాటఁగ, తూర్పునఁ గొన్నిగజములు పోఁగా గొప్పద్వార మున్నది. దానిపైనిఁ జక్కని శిల్పపని కద్దు. దీని కెదురుగను, గంగాపీఠి యనుజైనాలయమునకుఁ దూర్పునను, భీమసేనుని విగ్రహము కద్దు. దాని ముక్కు నెవరోదుర్మార్గులు నరికివేసినారు ఈద్వారమున కెదు

రను, పట్టణ దక్షిణపుసరిహద్దునను, కామలాపురమునకుఁ దూర్పున నొక మైలుదూరమునను, బల్లారిరోడ్డు ప్రక్కను, పట్టాభిరామాలయము కద్దు. పెద్దగుళ్లలో నదియొకటి. పంపాపతి గుడిప్రాకారముల రెండింతల యొక ప్రాకారము గలది. మధ్య విమానము చుట్టు గొప్ప స్తంభములు గలమంటపము లున్నవి.

42. మన బాటసారిని విజయనగరములో నిప్పటికిఁ గానుపించు మహాస్థలములను జూపించి తిరిగి బసలోఁ బ్రవేశఁబెట్టినాము. మనపూర్వులు చేసిన చిత్రపుపనులను జూచిన సంతోషముగలిగినను, ధనాశకొఱకు నాపనులను నాశనముఁజేసిన తురుష్కులను, హిందూబైరాగులను, ఏవగింపవలసివచ్చును. నగరనిర్మాణములు కారయితలు అగుశిల్పులు, ప్రభువులు, మంత్రి లోనగువారు ఎటులఁ గాలధర్మము నొందిరో; వారి కృత్యములు గూడ కాలగతిని మీరలేకపోయినవి గదా! ఇది శాస్త్రీయము శ్త్యసంభవసిద్ధమే.

43. ఇవియేగాక శ్రీవిద్యానగర మను విజయనగరము యొక్క అభ్యుదయాన్నత్యమును సూచించి, యింతకుఁ గాలగతికి లోనుగాని మహోత్తరము లయిన ప్రత్యభిజ్ఞ లున్నవి. ప్రప్రథమమున శ్రీభువనేశ్వరి యనుగ్రహమునబడసి విజయనగర ప్రభువులకు రాజ్యము సంపాదించి వారి నందుస్థాపించి లోకసంరక్షణార్థము వైదిక మార్గప్రవర్తకులయి వేద భాష్యాది 32 గ్రంథములు కావించి, నిస్పృహులయి తురీయాశ్రమ స్వీకారముఁజేసి గుహాప్రవేశముఁ జేసినమాధవాచార్య లనుశ్రీవిద్యారణ్యుల వారి సంస్కృతగ్రంథము లొకప్రత్యభిజ్ఞ. శ్రీకృష్ణదేవరాయ అలియరామరాజుల కాలముల నలంకరించిన కవిశేఖరు లొనరించిన యాంధ్ర కర్ణాటకగ్రంథములు రెండవ ప్రత్యభిజ్ఞ.

44. బ్ర॥ మ॥ కందుకూరి వీరేశలింగముగారు ఆంధ్రకవిచరిత్రలలో రెండవ ప్రత్యభిజ్ఞ విషయమయి విపులముగా వ్రాసి మొదటిదాని విషయమయి, అప్రస్తుతము గాన, దిక్ప్రదర్శకముగ వ్రాసిరి. దానిని విశదముగ నేను వ్రాసినాను. ముందు ముద్రించెదను. ఈహంపీదర్శినికి మాతృక హాస్పేట వాస్తవ్యులు బ్ర॥ మ॥ చిత్వాడ్గి హనుమంత గౌడుగారు హూణభాషలో రచియించిన 'Guide to Humpi'. వారి కోరిక మీఁదఁ దెనుఁగు మాత్రము వచ్చినవారికొఱకు నిది వ్రాసితిని

24 - 9 - 98.
నారాయణదేవరకెరె. } వావిలాల వేంకటశివావధాని.

పూర్వపుదివాన్ అగు ఉమనీతాంబీని పనినుండి చాలించి రాణిగారాపనిమీఁద కర్నలు మెకాలే దొరగారిని ఏర్పరచినందువలన ఉమనీతాంబీ కర్నలుగారిని బహు ద్వేషించుచుండెను. ఒకానొక సమయమునం దతఁడు కర్నలుగారికి విషప్రయోగము చేయ యత్నించెనఁట. ఈసంగతి రాణిగారికిఁ దెలిసినతోడనే యామె యందునగురించి విచారణఁజేసి, సాక్షులనువిచారించి, అపరాధుఁడని స్థిరపడినందువలన ఉమనీతాంబీని చింగలపేటలోని కారాగృహమునందు రాజకీయ ఖైదీగానుంచెను. అచ్చోనే యతఁడు గతించెను.

తరువాత రాణీగారు వసూలువిషయమై విచారించ సాగిరి. వసూలునుగురించి విచారింపఁగా, ఆదాయమెంతయో, వ్యయమెంతయో, అప్పెంతయో, తెలిసికొనుటకు మిక్కిలి కష్టముగానుండెను. ఈకష్టతరములైన యస్పష్టపులెక్కలు తిరుగవేసి తిరుగవేసి చూడఁగా ఈస్టుఇండియా కంపనీవారికిని, టినవెల్లి, కోటారము, కొచ్చీ, బంబయి మొదలైన స్థలములయందలి సాహుకారులకును, ఇయ్యవలసినయప్పు అనంతముగా బయలుదేరెను. ఈయప్పంతయు లెక్కవేసిచూడ, సంస్థానముయొక్క సంవత్సరపు ఆదాయముతో సరితూగెను. ఇంతగొప్పయప్పు తీరెడి యుపాయముగానక రాణీగారు విచారించి విచారించి, తుదకొక యుపాయమును జేసిరి. త్రావణకోరు రాజ్యమునందు గొప్పగొప్ప దేవస్థానము లనేకములున్నవి. వానియందుబహుధనముగలిగి యున్నను, పూజలు, అర్చలు క్రమముగా జరుగుటలేనందువలన, ఆద్రవ్యముసంస్థానము వైపుననుంచుకొని రాజుగారే యాదేవస్థానముల యుత్సవములు నడుపవలయునని పూర్వపు దివాన్ కొన్నిరోజులక్రిందట సూచించియుండెను. ఈసూచన రాణీగారికి జ్ఞప్తికి వచ్చి, సమ్మతి యైనందువలన నామె దేవస్థానములయందున్న యమితధనసంచయమును స్వార్థ పరమార్థములకు నుపయోగింపఁదలఁచెను. అదెట్లనిన. దేవస్థానముల వద్దనుండి యప్పుదీసికొని, సంస్థానమును ఋణవిముక్తముగాఁ జేయుట స్వార్థము. ఊరక మూల మూలగుచున్న దేవస్థానముల ధనమునకు వడ్డి దొరకునటుల చేయుట పరమార్థము! ఇట్లు విచారించి, రాణీగారీసంగతి మెకాలేదొరగారికిఁ దెలియఁజేయఁగా నతఁడు రాణీగారి విచారశక్తిని ఎంతయుఁ బ్రశంసించి, సమ్మతించెను.

ఇట్లు రాణీ ప్రధానులంసమ్మతింప, త్వరలోనే రాణీగారొకసభచేసిరి. ఆసభకు దేవస్థానముల యధికారులనందరిని బిలిపించి, వారికిఁ దనయుద్దేశము దెలిపి, యందువలన దేవస్థానములకును, తనకునుగలుగులాభములు స్పష్టపరిచెను. ఈసంగతియంతయు వారికి విశదపడఁగానే వారందఱు రాణీగారుచెప్పినట్లు నడచుకొనుటకు సమ్మతించిరి. ఇందుపై నాదేవస్థానముల బందోబస్తంతయుఁ జేయుటకు రేడీరావని యపరనామము

గల వెంకటరావను అధికారిని రాణీగారు నేర్పరచిరి. అతఁడాపని మిక్కిలి శ్రద్ధతోఁ జేసినందువలనఁ గొద్దికాలములోనే సంస్థానమునకుఁగల యప్పంతయుఁ దీరెను.

ఇట్లప్పు బందోబస్తుచేసి రాణీగారు న్యాయసభలను సంస్కరించుటకుఁ బ్రయత్నించిరి. ఆమె సంస్కృతమునందు పాండిత్యము గలదయి పూర్వాచారములయందిష్టము గలిగినదిగావున, మనుస్మృతి, పరాశరస్మృతి, విజ్ఞానేశ్వరము మొదలైన పూర్వగ్రంథముల యాధారమువలనను, ఇండియా గవర్నమెంటువారి చట్టముల యాధారమువలనను, లోకులకు హితకరములగునని తనకుఁ దోచినచట్టములను గొన్నిటినిగూర్చియు నొక గొప్పచట్టముల గ్రంథము, తనరాజ్యముకొఱకు నిర్మించవలెనని యామెదలంచెను. కాని యింతగొప్పగ్రంథము, న్యాయశాస్త్రమునం దసమానప్రజ్ఞగల విద్వాంసుని సహాయములేక గానేరదని రాణీగారికిఁ దోచెను. ఇంతలో రాణీగారికి వివాహ సమయమాయెను. నిండుయౌవనావస్థ ప్రాప్తమయినందువలన నీకె వివాహము చేసికొనవలెనని లక్ష్మీబాయిగారు నిశ్చయించిరి. పూర్వపు రాణీగారి భర్తయొక్క బాంధవుఁడును, కులీనుఁడును, బ్రాహ్మణుఁడును అగు రాజరాజవర్మయను పేరుగలవిద్వాంసుఁడొకఁడు, చెంగనాసేరీ గ్రామమునందు వాసముచేయుచుండెను. అతని విద్వత్తుకు మోహించి, యతనిని రాణీగారు వరియించిరి. త్వరలోనే వీరికి వివాహమై రాజరాజ వర్మగారు 'కోయిలతంబూరాను' అనుపదవిని జెందిరి. ఇతఁడు రాణీగారికంటె నొకసంవత్సరము పెద్ద. ఇతఁడు గొప్పవిద్వాంసుఁడని కీర్తిని జెందెను. ముఖ్యముగా నితనికిఁ బ్రియమైనది న్యాయశాస్త్రము. సిద్ధాంతముక్తావలి మొదలైన న్యాయగ్రంథములను జదివి యితఁడు న్యాయశాస్త్ర విశారదుఁడయ్యెను. ధర్మశాస్త్రమునందును ఇతనికి గొప్పప్రవీణతయుండెను. ఇట్టి యసామాన్య పండితుఁడగు భర్తవలన, రాణీగారు చేతఁ బూనినగ్రంథనిర్మాణమునకు బహుసహాయము గలుగుచుండెనని వేరె చెప్పవలెనా? రాణీగారి కితఁడన్ని పనులయందును సహాయభూతుఁడయి వర్తించుచుండెను. చదువరులారా! ప్రౌఢత్వమునందు వివాహముచేసికొను పద్ధతి మలబారు దేశమునందుండుటవలననే గదా లక్ష్మీబాయిగారికి వయోరూపగుణ విద్యలయందు సమానుఁడయిన పతి దొరకఁగలిగెను! ప్రౌఢవివాహములు జరిగినయెడల స్త్రీనీతి భ్రష్టమగుననియు, సంఘసౌఖ్యము తగ్గుననియు వృథా వాక్పాండిత్యముఁ జూపువారు రాణీ లక్ష్మీబాయిగారి యుదాహరణముఁజూచి, విద్యాప్రౌఢ వివాహములవలన మనకుటుంబసౌఖ్యము వృద్ధియగునే గాని తగ్గనేరదని మనస్సమాధానముఁ జేసికొనవచ్చును. బొమ్మలపెండ్లిళ్ళవలె నోరెఱుఁగని పసిపిల్లలకు వివాహముఁ జేసినందువలనఁ గలిగెడి నష్టములందఱికిని దెలిసినవిషయమే యైనందువలన నిచ్చట మరల వ్రాయవలసిన ప్రయోజనము

లేదు. ప్రౌఢవివాహములవలని లాభములు లక్ష్మీబాయి చరిత్రమువలనను తేటపడఁగలవు. ప్రౌఢవివాహములు జరిగినపక్షమున నిట్టినష్టములు గలుగును, అట్టినష్టములు గలుగును, అని ప్రాచీనాచారపరాయణులు వృథా భయపెట్టుదురు. ఈభయము లన్నియుఁ గేవల కల్పనలేగాని, వాస్తవములుకావని లక్ష్మీబాయి మొదలగు సాధ్వీమణుల చరిత్రములవలన స్పష్టమగుచున్నదియని చెప్పకతప్పదు. మన దేశస్థులగు మళయాళులకుఁ బ్రౌఢవివాహమువలన లాభమేగాని నష్టము గలుగుటలేదని చూచుచు, మనలోమాత్రము స్త్రీవిద్యాప్రౌఢ వివాహములవలన నష్టముగలుగునని చెప్పుటచూడఁగా మనము మనుష్యకోటిలోని వారముకామని చెప్పుటకాదా?

మిక్కిలి బుద్ధిమంతురాలగు ఆమెకు విద్యావంతుఁడగు కోయిలతంబూరాన్ యొక్క సాంగత్యమువలన మఱింత యుత్సాహము గలిగి, యామె యారంభించిన చట్టముల గ్రంథమును శీఘ్రముగా వ్రాయుచు, నడుమనడుమ దానిని మెకాలేదొరగారికిఁ జూపుచు, ఆయన యనుమతిని బొందుచు, ఆగ్రంథమును సంపూర్ణముచేసి దానికి, 'సత్తావరక'మను నామమిడెను. ౧౮౧౧వ సంవత్సరమునుండి, రాజ్యములోనిసర్వవ్యాపారము లీసత్తావరకమున ననుసరించి జరుగుచుండెను. ఈక్రొత్తచట్టములప్రకారము న్యాయము జరుగవలయునని, రాణీగారుక్రొత్త న్యాయస్థానముల నేర్పరచిరి. క్రమముగా సర్వన్యాయస్థానములయందు సంస్కృతము, మలబారి, యింగ్లీషులందుఁ బ్రవీణులగు వారిని నియమించిరి. కోచీ నివాసస్థుఁడైన రామన్ మేనన్ అను పండితోత్తముని, ముఖ్య న్యాయసభలోని ముఖ్యన్యాయాధీశునిగా నేర్పరచిరి. తరువాత రాణీగారొక చట్టము నేర్పరిచి, తమ రాజ్యములోని బానిసవ్యాపారమును బొత్తిగా మాన్పివేసిరి. ప్రజలకు భారమైనపన్నులు తగ్గించిరి; ఉప్పువ్యాపారమును వృద్ధిపరచిరి. ఇట్లుదినదినప్రవర్ధమానమై రాజ్యమున్నతస్థితిని బొందుచుండెను.

రాణీ లక్ష్మీబాయిగారు శ్రీపద్మనాభస్వామియం దధికవిశ్వాసము గలవారై యాదేవతను భక్తిప్రపత్తులతోఁ బూజించుచుండిరి. వంశపరంపరగా జరుగుచున్న దానధర్మములను దప్పక నడుపవలయుననియు, పూర్వులకంటె నధిక ధర్మకృత్యములను జేయవలయుననియు, ధర్మవర్ధనీ యన్న బిరుదును సార్థకపరుపవలయుననియు రాణీగారు సదాయత్నించుచుండిరి. కానిదివాన్ గారగు మెకాలేదొరగారు ఆంగ్లేయుఁడైనందువలన, దానములు, ధర్మములు, అన్నసత్రములు, మొదలైనవన్నియు వ్యర్థపుకర్చులని యతఁడు దలఁచుచుండెను. కనుక ధర్మసంబంధములైన కృత్యములన్నియుఁ దిన్నగాజరుగుచున్నవాలేదా యని మెకాలే విచారించెడివాఁడుకాఁడు. ఇందున గుఱించిన ప్రజలమొఱ వినెడివాఁడుకాఁడు. ఇట్లు మెకాలేగా రుదాసీనులైనందు

వలన రాజ్యములోని ధర్మాదాయము విషయమై మిక్కిలి యవ్యవస్థజరుగుచుండెను. ఒకరోజు రామేశ్వరమునకుఁ బోవు యాత్రికులు గొందఱు రాణీగారియొద్దికిఁ బోయి, తమకు నన్నపానాదులు దొరుకుటలేదనియు, అందునగురించి దొరగారు నిర్లక్ష్యము చేయుచున్నారనియు మొఱ్ఱపెట్టుకొనిరి. వారికిఁగొంత ధనమిచ్చి పంపి రాణీగారు మెకాలేగారికి నిట్లు వ్రాసిపంపిరి.

"దివి ౧౯ ఎడవం. మలబారీవర్షములు ౯౮౬.

నాకు జ్యేష్ఠభ్రాత తుల్యులగు కర్నలుదొరగారికి—మీరు అన్నిపనులను దక్షతతోఁ జేయుచున్నందువలనను, మీకు మాదేశముయొక్క గొప్పతనము, స్థితి, రీతులు, రూఢులు, ఆచారములు సంపూర్ణముగా విదితమేగనుకను, వానినిగురించి నేను మీకు వ్రాయవలసిన యావశ్యకములేదు. మాపూర్వీకు లేర్పరచిన నియామకములును, పద్ధతులును, దానధర్మములును, ఆచారవిచారములును, వారిదయాళుత్వమునకు ద్యోతకములై, ప్రజలహితముకొఱకును, దేశోన్నతికొఱకును, ఏర్పరుపఁబడినవి. కనుక మీరు పూర్వనియమములను దప్పక రాజ్యమును నడుపవలయును. వానిలో హెచ్చుతగ్గులేమియు చేయకుండవలయునని మీకు నావిన్నపము. రామేశ్వరమునకు వెళ్లెడియాత్రికుల కన్నపానాదులు, దక్షిణలు దొరుకుటలేదనిన మొఱ నా చెవిని సోకినది. ఆసంగతి మీకుఁ దెలియఁజేయుచున్నాను. కనుక మీరిందువిషయమై శీఘ్రముగా బందోబస్తు చేసెదరని నమ్ముచున్నాను. మహాసింగు కిల్లాదారునకుఁగూడ బందోబస్తు చేయుమని యాజ్ఞఁ బంపినాను. ఉత్తరప్రత్యుత్తరమువలన ఏపని యైనను ద్వరలోనౌను. కర్నలు దొరగారు నామాటలను సన్మానించెదరని నమ్ముదును.

నేను స్త్రీనైనందువలన మిమ్మును జ్యేష్ఠభ్రాతగా భావించి రాజ్యమునందలి పనులన్నియు విశ్వాసముతో మీకు సమర్పించితిని. కనుక నారాజ్యములోని, దానధర్మము లిదివఱకు జరుగు చున్నటుల జరిపి, మీరు మాదేశమును, మాప్రజలను సుఖులను జేసెదరని సంపూర్ణముగా నమ్ముచున్నాను.

(దస్కతు) లక్ష్మీబాయి"

రాణీగారు తామునమ్మిన ధర్మమును దృఢముగాఁ బాలించుట కెంతతత్పరులై యుండిరో, ప్రసంగోచితముగా నాంగ్లులకడఁగూడ స్వతేజోబలమును నిర్భయముగా నెట్లుప్రకటముఁ జేయుచుండిరో, యీయుత్తరమువలనఁ బ్రకటమగుచున్నది.

ఇట్లుశుక్లపక్ష చంద్రునివలెఁ ద్రావణకోరురాజ్యము దినదినము నాగరికతయందుఁ బ్రవృద్ధమానమగుచుండ ౧౮౧౩ వ సంవత్సరమున లక్ష్మీబాయిగారికిఁ బుత్రరత్నము గలిగెను. సింహాసనమున కధిపతి జన్మించినందువలన రాజ్యమునందంతటను గొప్ప

యుత్సవముఁ జేసిరి. ప్రతిగృహమున మామిడితోరణములు మొదలైనవి గట్టి పండుగ చేసిరి. పంద్రెండవదినమున మహోత్సవముఁజేసి పిల్లవానికి ,,రామవర్మ మహారాజ'ని పేరు పెట్టిరి. హిందూధర్మశాస్త్రప్రకారము మీఁకమీఁదఁ ద్రావణకోరు రాజ్యమున కీశిశువే యధిపతి యని ప్రసిద్ధిపరచిరి. తరువాత నొకశుభముహూర్తమున ౧౮౧౩ వ సంవత్సరమున ఆశిశువునకు రాజ్యాభిషేకము చేయఁదలఁచిరి. ఇది ౯౮౯ చింగం, మలబారీవత్సరంబు ౨౭ వ రోజున రాజ్యాభిషేక మహోత్సవము జరిగెను. అచ్చటిరూఢి ననుసరించి యారోజున రాజగృహములో గొప్పదర్బారుచేయించిరి. రాణీలక్ష్మీబాయిగారు శిశువున కుత్తమ వస్త్రభూషణము లలంకరించి, తాను నలంకృతలై, బాలరాజును దీసికొని సభామంటపమునకు వెళ్లెను. సభాజనులందఱును తమతమ నియమితస్థానముల నాక్రమించిన పిదపఁ దనరెండు హస్తములతో రాణీగారు బాలరాజును దీసికొని సింహాసనమునుండి క్రిందికిదిగి, ప్రసన్నవదనలై, తనస్వాభావిక గంభీరవాణితో నందఱు నాశ్చర్యమొంద నిట్లనిరి— ,,ఆనరేబిల్ ఈస్టుఇండియా కంపనీవారు సదా న్యాయమార్గమునఁ బ్రవర్తించుచుందురుగావున వారి యిచ్ఛానుసారముగా నన్నియుఁ బద్మనాభస్వామి వారు నెరవేర్చు చుందురు. నాకుల దైవమగు శ్రీపద్మనాభ స్వామివారి ప్రసాదమువలన నాకుఁ గలిగిన పుత్రుని కంపనీవారి చేతులోఁ బెట్టుచున్నాను. కనుక నితనిఁ బెద్దవానిఁజేయుటయు, నితనికి విద్యాబుద్ధులు చెప్పించుటయు, నితనినింత వైభవమునకుఁ దెచ్చుటయుఁ గంపనీవారి భారమైయున్నది. ఇంతకంటె నధికమేమి చెప్పవలయును ?" ఇటులఁబలికి పిల్లవానిని మెకాలే దొరగారి చేతికియ్యఁగానే, ఆయన యాపిల్లవానిని సింహాసనముమీఁద కూర్చుండఁబెట్టి ,,ఈరామవర్మగారు నేటినుండి యీరాజ్యమునకు రాజయ్యెను. ఈయన యుక్తవయస్కుఁడగునంతకు రాణీలక్ష్మీబాయిగా రితని పాలనకర్త్రియని రాజ్యముచేయఁగలరు" అని యందఱికిఁ దెలిపెను.

ఈరాజ్యాభిషేక సమయముననే మెకాలేదొరగారు దివాన్‌గిరి వదలుకొనిరి. దేవన్ పద్మనాభన్ గారు క్రొత్తదివాన్‌గారైరి. కాని యీక్రొత్తదివాన్‌గా రధికారమును కొద్దిదినములవఱకే యనుభవించిరి. అయిదాఱుమాసము లధికారముఁజేసి యతఁడు స్ఫోటకముచే మృతుఁడయ్యెను.

అటుతరువాత రమారమి యొక సంవత్సరమునకు రాణీగారికి రెండవ కుమారుఁడు పుట్టెను. కాని యాయానందము విశేషదినములుండినదిగాదు. రాణీగారికి బాలింతరోగము సంప్రాప్తమై రెండు నెలలలోనే యది యసాధ్యమాయెను. అనేక వైద్యు లనేకౌషధము లిచ్చిరిగాని, వానివలన గుణమేమియు లేక వ్యాధి హెచ్చుచునే

యుండెను. బ్రతుకునన్న యాశ లుడిగినపిదప నొకనాఁడు లక్ష్మీబాయి, తన ప్రియభర్తను తనవద్దికిఁ బిలిచి, తనచెల్లెలగు పార్వతీబాయిని, తన చిన్నపిల్లలను, అతని చేతిలోఁబెట్టి యొప్పగించి, యిట్లనియె:—"ఇదివఱకు నాచే సంరక్షింపఁబడిన యీ పిల్లలనందఱిని మీచేతిలోఁ బెట్టుచున్నాను. ఇఁక మీరు వీరందఱిని సంరక్షింపవలయును. ఈరామవర్మ మహారాజు యుక్తవయస్కుఁడగువఱకుఁ బార్వతీబాయి పాలనకర్త్రియై రాజ్యము నడుపునట్లుచేసి, నాకు సహాయము చేసినట్లు, ఈమెకు సకలరాజ్యకార్యములయందు సహాయముఁ జేసెదనని మీరు వచనమిచ్చినయెడల నేను సుఖముతోఁ బ్రాణములు విడిచెదను." తన ప్రియపత్నియొక్క యీనిరాశవచనముల విని, రాజరాజవర్మ యత్యంత దుఃఖితుఁడై, నేత్రములనుండి వెడలు దుఃఖాశ్రువులచే నేమియు మాటరాక కొంతసేపూరకుండి, ధైర్యమవలంబించి పత్నితో "నేను నీయిచ్ఛ పూర్తిచేయుదును" అని పలికెను. తరువాత రాణీగారు చెల్లెలైన పార్వతీబాయి వైపుచూచి, మిక్కిలి దీనస్వరముతో నిట్లనియె. "అమ్మాయి పార్వతీ! నీవు బహుజాగరూకతతో రాజ్యముఁజేయవలయును ఈయర్భకులను తిన్నగా సంరక్షింపుము. వీరిని పెంచి, రామవర్మ మహారాజుగారు యుక్తవయస్కుఁడు కాఁగానే, శుద్ధాంతఃకరణపూర్వకముగా, ఆయనరాజ్య మాయనకిచ్చి కృతార్థురాలవుగమ్ము. నేనైతే వెళ్ళుచున్నాను. నాకొఱకు దుఃఖింపకుము." ఈప్రకారము అక్కగారగు లక్ష్మీబాయి యంత్యకాలమందిట్టి యుపదేశము చేయఁగా విని, ఆకోమలాంతఃకరణ యగు పదియేడు సంవత్సరముల యబల, దుఃఖాతిరేకముచేత మాటరాక గద్గద కంఠయై "అక్కా! నీవు చెప్పిన ప్రకారము నేను చేయుదును. మీయాజ్ఞ యెంతమాత్రము తప్పక నడుచుకొనియెదను. నీవు మాత్రము నన్ను విడిచిపోయెదవా" యని దుఃఖింపసాగెను. అప్పుడచ్చటివారందఱును దుఃఖింపసాగిరి.

ఈప్రసంగానంతరము రెండుదినములకు లక్ష్మీబాయిగారు నశ్వరసుఖముల వదలి, శాశ్వతమగు పరసుఖము ననుభవించుటకుఁ జనిరి. మలబారు దేశమంతయు దుఃఖసముద్రములో మునిగెను. త్రావణకోరులోని ప్రతి గృహమునందును రోదన ధ్వనులు వినవచ్చుచుండెను. తల్లికొఱకు రోదనముచేసినట్లనేకులు రోదనము చేసిరి.

రాణీలక్ష్మీబాయిగారు నాలుగు సంవత్సరములే రాజ్యము చేసిరి. కాని యామె రాజ్యమునందు ననుభవించిన సౌఖ్యము ప్రజ లదివఱకైపోయినరాజులలో నెవ్వరి పరిపాలనములోను అనుభవించినవారుకారు. ఆమె ప్రజలను స్వదేహమునకంటె నెక్కువగాఁ గాపాడినది. రాజ్యవిషయమై కర్నలుగారి సలహాపుచ్చుకొనినను, తనకు యోగ్యమని తోచినదానినే గ్రహించుచుండెను. ఈమెస్వబుద్ధివలన పెక్కుచట్టములను

నిర్మించెనని యిదివఱకే తెలిపియున్నాను. న్యాయము, నీతి మొదలైన సంగతులను గుఱించి యామె చూపిన చాతుర్యమును, ఔదార్యమును అత్యంత స్తుతికిఁ బాత్రములు. ఆమెయందు దృఢనిశ్చయమనెడి సద్గుణ మితరగుణములకంటె నధికముగా నుండెను. ఈమెయం దీగుణముండెను గనుకనే, యీమె తన రాజ్యములోని న్యాయసభలను గుఱించి యనేక సంస్కరణలు చేయఁగలిగినది. ఆమె అయోగ్యుఁడైన ప్రాతదివానును దీసివేసి, దీర్ఘప్రజ్ఞుఁడగు మెకాలే దొరగారిని దివానుగా నేర్పరచెను. ఇందువలన నామె విశాలమైన దూరదృష్టి వ్యక్తమగుచున్నది. మెకాలేదొరగారామె వాక్యములు మన్నించి, దేశకళ్యాణముగోరి, సదా కార్యతత్పరుఁడై రాణీగారికి మనఃపూర్వకముగా సహాయముఁ జేసినందు కాతని నెంతయుఁ గొనియాడవలసియున్నది. వర్ణమునందు విప్రవరుఁడగు కోయిల తంబూరానయొక్కయు, సత్స్వభావముచే విప్రవరుఁడు నాఁదగు మెకాలేదొరగారి యొక్కయు సహాయముఁ బుచ్చుకొని, క్రొత్తచట్టములను నిర్మించి, న్యాయసభలను సంస్కరించుటఁజూడఁగా మహారాజ్ఞీగారు విజ్ఞానేశ్వర ఋషియొక్క యీక్రిందియాజ్ఞను దప్పక శిరసావహించి, యందుఁ జెప్పఁబడిన ఫలమునుగూడఁ బొందిరని చెప్పవచ్చును.

“మ. ధరణీనాథుఁడు క్రోధలోభముల బొంతంబోక సద్ధర్మత
త్పరుఁడై విప్రకులవిప్రవంశ్యులగు విద్వద్వర్యులం దాను ను
స్థిరధర్మ వ్యవహార నిర్ణయమొగిం జేయందగుం జేయఁగాఁ
బరమై దిక్కులనెక్కఁగీర్తి వెలయుంభాగ్యంబు నానాటికిన్."

ఈరాణీగారి చరిత్రమువలన నిదివఱకు స్థాపించిన సిద్ధాంతములు గాక యొక గొప్ప సిద్ధాంతము స్థాపించవలసియున్నది. ఆసిద్ధాంత మేదియన “నిష్పక్షపాత బుద్ధితో విచారించినయెడల మానవశాస్త్ర దృష్ట్యా స్త్రీలు పురుషులకంటె నధికులు కాకపోయినను, ఎటుచూచినను పురుషులకంటెఁ దక్కువవారు కారు." అనేక సంవత్సరములు రాజ్యముచేసి, యనుభవశీలులును, వయోవృద్ధులును అగురాజులు చూపనిబుద్ధికౌశల్యము, నీతిస్థైర్యము, సారాసారవిచారము, లక్ష్మీబాయిగారు నాలుగు సంవత్సరముల రాజ్యపరిపాలనములోఁ జూపిరి. ఈమె యొక్కతె యిట్టి సామర్థ్యంబుఁ జూపెననికాదు. ఇదివఱకు వర్ణింపఁబడిన భవాన్యహల్యలును, ఇఁకమీఁద వర్ణింపఁబడు రాణీలును, మహారాణీలును, ప్రాంతాధికారిణులును, సామాన్యస్థితిలోని సాధ్వీమణులును, ఇట్టి యమిత బుద్ధి సామర్థ్యంబును జూపియున్నారు. ఇందున గుఱించి యొక గ్రంథకారుఁ డిట్లు వ్రాసియున్నాఁడు. “హిందూదేశములోని యొకానొక సంస్థానములోని రాజ్య వ్యవహారము బహుబందోబస్తుతోను, బహుజాగరూకతతోను,

బహు మితవ్యయముతోను జరుగుచున్నదనియు, ఆసంస్థానములోని ప్రజలన్యాయ పరంపరలచే బాధపడక సుఖించుచున్నారనియు, దినదినము రాజ్యములోని వ్యవసాయ మధికమగుచున్నదనియు వినిన పక్షమున నిట్టి నాలుగు సంస్థానములలో మూడు సంస్థానములు స్త్రీలచేఁ బాలింపఁబడుచున్నవని నిశ్చయించుటకు సందేహము లేదు." కేవలము మన హిందూ స్త్రీలవిషయమయియే యీమాట నిజమని కాదు. దేశాంతరములయందును రాజ్యారూఢలైన రాజపుత్రికలందఱును, ఇట్టి కౌశల్యమునే చూపిరి. రాజ్యముఁ జేసిన పురుషులసంఖ్యకంటె, సింహాసనారూఢలైన స్త్రీలసంఖ్య యత్యంత స్వల్పముగానున్నది. అపరిమితమైన రాజులసంఖ్యనుండి యుత్తమరాజులనెంతమంది నేరి చూపింపవచ్చునో, యంతమంది యుత్తమరాజ్ఞులను రాజ్యము చేసిన స్త్రీలయొక్క యత్యల్ప సంఖ్యలోనుండి చూపింపవచ్చునని చెప్పుట కెంతయు సంతోషమగుచున్నది. ఈసంగతి స్త్రీజాతి కెంతయు భూషణాస్పదము. రాజ్యముఁ జేసిన స్త్రీలలో ననేకులు పూర్వరాజులచే నధోగతికిఁ దేఁబడిన రాజ్యముపైఁ గూరుచుండి యారాజ్యములను మరల మహోన్నతదశకుఁ దెచ్చిరి. ఇందునకుదాహరణము మనలక్ష్మీబాయియే. మామగారిచేఁ బాడుచేయఁబడి, కంపనీవారి చేతులలోఁ బడుచున్న రాజ్యమును దక్కించుకొని మహోన్నతదశకుఁ దెచ్చిన లక్ష్మీబాయిగారి నెంత కొనియాడవలయునో తెలియకున్నది. స్త్రీలకు స్వాభావికములని వాడుకొనఁబడు చాంచల్యము మొదలైన దుర్గుణము లిట్టి స్త్రీల యుదాహరణములలోఁ గానఁబడకయే తద్విరుద్ధములైన మనోదార్ఢ్యాది సద్గుణములే కానఁబడుచున్నవి. ఇట్లు దైవయోగముచేఁ గొందఱు స్త్రీలకు రాజ్యవైభవము ప్రాప్తమైనందువలన, సకల స్త్రీజాతి విరుద్ధములై కొందఱు స్త్రీద్వేష్ట లేర్పఱిచిన సిద్ధాంతములు ప్రత్యక్ష ప్రమాణములచే నబద్ధములని ఖండింపఁబడినవి. ఇట్లు రాజ్యస్థలైన స్త్రీలు స్వజాతికయి యనంతోపకారములఁ జేసియున్నారు. స్త్రీనిందకుల నోరుగట్టుట కిట్టి మహాసాధనంబుల నొసంగిన దయామయుఁడైన పరమేశ్వరుని స్త్రీలందఱును వేయినోళ్లఁ గొనియాడవలయును.

కొందఱు, పైనిస్థాపించిన సిద్ధాంతముపై నొకయాక్షేపణ తేఁగలరు. అది యేదన "స్త్రీలు రాజ్యముఁ జేసి నప్పటికిని, రాజ్యములోని యధికారులందఱును పురుషులే యైనందువలన, రాజ్యములోని యున్నతియంతయుఁ బురుషులచేఁ జేయఁబడెనే గాని రాజ్యస్థయైన స్త్రీచేతఁ జేయఁబడెనని చెప్పఁగూడదు." ఈయాక్షేపణఁ జూడఁగానే మొదల నిజమైనదేయని తోచును; కాని కొద్దిగా సూక్ష్మవిచారముఁ జేసి చూడ నిందలి యసత్యత స్పష్టము కాఁగలదు. ఈయాక్షేపణమే నిజమని గ్రహించినయెడల రాజుల రాజ్యములో జరిగిన లోకోపకార్యములకు రాజులను భూషింపుటకు వీలుండదు.

“కానీ, విస్సా! ఈవిద్యార్థిమాటకేమి? మనకుఁ జిక్కినాఁడు. ఇఁక నెక్కడకు పోఁగలఁడు? పాపముమాట యటుండఁగా మన కీఘోరకృత్యము చేసినందుకు లాభ మున్నదా లేదా? ఆలోచించుదము.”

“లేకేమిరా? అన్నా! ఎప్పుడయిన నన్నమాట భుక్త మనవిషయమై తప్పినాఁడా?”

“లేదుకాని; విస్సా! భుక్తగారి యీపటాటోపమంతయు నెందుకు?”

“హైమవతిని స్వీకరించుటకును లలితను—మఱి” అని నసగ నారంభించెను.

“నసగకు. తురకవానికి శ్రీకాకూళములో నజరుపట్టుటకు కాదా? మన మెఱుఁగమా?”

“అవును; అయితే, మనకేమి? దానిబ్రతుకు చెడనే చెడ్డది. ఇఁక మనబాంధవ మాలోచించుకొనుట యేల?”

“ధనాశచేత తొందరపడకు. తెల్లవారుజాము వఱకును నెవరును ఇక్కడకు రారు. ఈలోపున మనపని కడ్డుండదు.”

“అయితే నీవనుమాట యేమి?”

“పాపము! ఆదీనురాండ్రేమయినారని శ్రీకూర్మములో ననుకొనుచున్నారు? పొన్నాడలో మానముక్రిందట నాయుత్తమురాండ్రకు కనికరము, సిగ్గు, మర్యాద, కులాభిమానము, మొదలయినవానిని బొత్తిగావిడిచి నన భుక్తగారి దురుద్దేశమును వారి కతఁడిచ్చు ప్రతిఫలమును మనము తెలియచేసినపుడు మనతో వారేమన్నారు?”

“అవును; ఓరీ! ఆత్మహత్య చేసికొనుటకు నిశ్చయించినారు. ఇప్పుడుపొన్నాడ లోను అట్లు వారప్పుడె జరిగించినారని అనుకొను చున్నారు.”

“ఓరి! వెఱ్ఱివాఁడా! అట్లు జరిగినపుడు మనమీ విద్యార్థిని చంపినా యీ విషయమున మనచేతనయిన మఱియేపని చేసినా వానిమనను సంతోషించునటరా? సంతోషించనపుడు వానిఖరారునిలుచునా? వాఁడు చెప్పిన దుష్కార్యము నెల్ల మనము ముష్కరముగాఁ జేయుచున్నామని మనవిషయమై వాఁడీవఱకు ఖరారుతప్పలేదుకాని యతఁడెందరి కెన్ని ఖరారులు తప్పుచుండుట మనము చూచుచున్నాము? అనేకవిధ ములచేత నాసపఱచి యెందరు కులసతులయొక్క వ్రతమును జెఱచి వారి నేడిపించు చున్నాఁడు? ఇదియునుగాక మఱియొక రహస్యము రాత్రిజరిగినది. ఇదివరకు నీయొద్ద దాచినాను.”

“రహస్య మేమిటి?”

“నిన్నరాత్రి హైమవతి నాకు లలితతోఁ గూడఁ జిక్కుటకుఁ దగిన మంచియవ సరము ఆకస్మికముగా సమకూరినది. భుక్తగారు మనకుఁజేయు బహుమానము నా చేతిలో పడినట్లు సంతోషించినాను. భుక్తగారు మనకు నియోగించిన బలాత్కార

ముము తెగించి చేయుటకు సిద్ధముగా నున్నాను.''

„అయ్యో ! ఎందుకా సమయమును వదిలిపెట్టినావు! మనముఅదృష్టహీనులము. ఇఁక మనమెన్ని గడ్డలు గఱచినను కార్యములేదు.''

„ఇదివఱకు మనము దురదృష్టవంతులము. ఆమె యుపదేశము రాత్రి నాహృదయమున నాటినప్పటినుండియు నాకు జాలియు పశ్చాత్తాపమును హెచ్చినవి.''

„ఏమిచెప్పినది?''

„ఆమె చేసిన తత్త్వోపదేశమును నేనుచెప్పితినా ఈరేయెల్లను బట్టును: ఆమె చెప్పిన సంగతులలో నొక్క సంగతిమాత్రము మనము చక్కగా నాలోచింపవలెను.''

„ఏమిటి?''

„అదుర్మార్గుని కొరకు మనమెందఱు స్త్రీలయొక్క యుత్తమ వ్రతమును జెఱిపినాము? ఒక్కొకచోట మన ప్రయత్నము లిఁక పనికిరావని యించుమించుగ మనము నిరాశచేసికొను వఱకును మనము మెత్తపఱుపఁగలిగినామా? అట్లు మెత్తపడినవారు తరువాత రహస్యప్రవర్తనలో నెంత నింద్యలయినారు! మొదట మనమా దుర్మార్గునాశ్రయించి యసత్యము పలుకుటమొదలు బ్రహ్మహత్యవఱకును జంకుచు నేచేసి నీతిమర్యాదలన్నిటిని దాటినామా లేదా! కాఁబట్టి యిఁక మనము దుర్వ్యాపారమును మాని యిదివఱకు మన మతిక్రమించిన నీతి నిబంధనలకు పశ్చాత్తాప పడుటమేలు.''

„ఆనందమా! అయితే ఈవిద్యార్థిని మనము వదిలిపెట్టుదమా యేమి?''

„అభ్యంతరములేకుండ మన చేతనయిన యుపకారముతోఁగూడ నితనిని విడిచిపెట్టుదము.''

„ఇపు డితని కుపకారము చేయుటకు మనయొద్ద నేమున్నది?''

అప్పుడానందము తన బొడ్డుకొంగుమూటవిప్పి పది మొహరీలతోడను రెండు పుస్తెలతోడనున్న మంగళసూత్రమును జేతఁబట్టుకొని „విస్సా! ఈమంగళసూత్ర మెవరిదో యెఱుఁగుదువా? ఇది హైమవతియొక్క కంఠాభరణము'' అనిపలికెను.

విశ్వేశ—(ఆశ్చర్యపడి) నీకెట్లువచ్చినది?

„రాత్రి నిన్న నే నామెను జూచినపు డీయొక్క యాభరణమును దక్క నామె యొడల నేమియునులేదు. ఇరువురును బాలవితంతులవలెఁ గనిపించినారు. తల్లియును గూతురును నన్నుఁ జూచినతోడనే నేను వారివ్రతమున కేమిభంగము గలుగఁజేయుదునోయని నాచేత నీబంగారమును బడవైచి దైన్యరస ముట్టిపడునట్లు నన్ను ప్రార్థించిరి. అంతకుమున్న రాయివలెనున్న నాహృదయము కరగి నీరయినది. నాచేతికిచ్చిన యీబంగారమును తిరిగి నేనెన్ని విధములచేత వారికిచ్చివేయుదునన్నను వారు నిరాశ

రించిరి. ప్రాణములయందే వారు నిర్లక్ష్యముచేసికొని వాని నెట్లయిన విడుచుటకుఁ బోవుచున్నప్పుడు వారి కీవిత్తమెందుకు ?"

„సరే, అయితే వీనిని లేపి యీబంగారము చేతనుంచి పంపుదము. ఈతఁ డశనశూన్యుఁడు. విద్యాభిలాషచేతఁ గాశికి ప్రయాణము గట్టుకొనియున్నాఁడు."

ఈకోసవాక్యమును వినఁగానె యింతకుమున్నె వారీప్రసంగమున కారంభించిన మఱికొంత సేపటికి మేల్కొని కపటనిద్రచే వినుచుండిన విద్యార్థి మఱి తమకమును బట్టలేక కెవ్వునఁ గూయుచు లేచి వారి పాదములపైఁబడి వెఱ్ఱివానివలె నేడువసాగెను. వారు హృదయములు మఱింత కరగినవారై వానిని లేవనెత్తి కన్నులొత్తి చిత్తమునఁ గలంక దేర్చి యూరార్చి వారియ్యనిశ్చయించిన బంగారమును వానిచేతనుంచ గ్రహించి యావిద్యార్థి యిట్లు పలికెను:—

„ఆనందముగారు! విశ్వేశముగారు! మీరు నాకుఁజేసిన యుపకారమే చాలును. నాజన్మమున్నంతకాలము మఱచిపోను. వేఱె యీబంగారము నాకెందుకు ? భుక్త యొక్క దుర్నియోగమును వదలి నన్ను రక్షించినందుకు మీకెట్లు ప్రత్యుపకారమును జేయఁగలను ?"

విశ్వేశ—బాబు ! భట్టుగా ! మన చండాలపు భుక్తయొక్క బారి తప్పించుకొని నీవెచటనయిన బ్రతికినావన్న వర్తమానము మాకుఁదెలిసిన నదేమాకు వేయి ప్రత్యుపకారములు.

ఆనంద—నాయనా ! నారాయణ ! నీవుపుట్టుట యెఱుఁగుదును. నీతల్లిదండ్రులు గొప్పయైశ్వర్యములో నుండుట యెఱుఁగుదును. మన పౌన్నాడలో చింతావారంత పరువుప్రతిష్ఠలుగా బ్రతికినవారేరీ ? నీయజ్ఞానదశలో నీతల్లిదండ్రులు చనిపోఁగా గ్రామములో వారములిచ్చి నీకు చదువుచెప్పించినాము. పనికివచ్చినావు. పండితుఁడ వనిపించుకొన్నావు. కాఁబట్టి నాల్గుదర్బార్లలోను దిరిగి కీర్తిసంపాదించుకో. అదే మాకు ప్రత్యుపకారము.

విశ్వేశ—ఆనందము ! అవును. వీఁడాలాగున ఘనతకెక్కవలసినవాఁడే. మన భుక్త వీనికి అంత్యమందు నొకటి తెచ్చి పెట్టినాఁడుకదా !

ఆనం—చాలుచాలు. మనతుచ్ఛపు భుక్త దెచ్చిన యాంత్యమాటకేమి ? వీని మంచినడత, వీనిపాండిత్యము, వీని తక్కినయన్ని సుగుణములును, అట్టి నట్టినింద నెంతలో పోఁగొట్టును ? వీనియందును ముండవారి కోడలియందును లేశమయిన దోషము లేదని యెవరెఱుఁగరు ?

నారాయణ—నాయనలారా ! మిమ్మును మఱియొక యుపకారము కోరెదను.

ఉభయులు—బాబు! చెప్పు.

నారా—నా కాశీ ప్రయాణారంభములోపున తిరిగి మఱియొకమాఱు మీదర్శనమున కొకనాఁడు రాత్రి రహస్యముగా వచ్చి మీతో మాటాడెదను.

విశ్వే—అభ్యంతరము లేదు.

ఆనం—ఓరి విస్సా! మనమింక మసలకూడదు. ఈకుఱ్ఱవాని నెట్లయిన సాగనంపి భుక్తగారి యొద్దకు మనమరుగులోపున నతనికిమనము తెలియఁజేయవలసిన సంగతులను యోచించుకొనవలెను. మన తెలియఁజేయుటలో నేమి వసుగున్నను లోసుగున్నను వాఁడు మన ప్రాణములమీఁద నున్నాఁడనుకో.

ఈకొనవాక్యములతో వారులేచి తామిచ్చిన బంగారమును గట్టిగా మూటగట్టుకొమ్మని నారాయణభట్టుతోఁ జెప్పిరి. అతఁడు బంగారమును భద్రపఱిచికొని లేచి వారికి వినయపూర్వకముగా ననేకనమస్కారము లొనరించి యాశీర్వదింపఁబడి వారిచేఁ గొంతదూరమువఱకు ననుగతుఁడై వారు దన్ను విడిచినపిమ్మటఁ దక్షిణమ శ్రీకూర్మమును విడిచి యారాత్రి నిశీథమునక వెన్నెల వెలుఁగున మార్గస్థుఁడయ్యెను.

అయిదవ ప్రకరణము.

శ్రీకూర్మమునకు మూడుకోసులదూరమున నున్న శ్రీకాకుళ మారోజులలో గోలకొండ సుల్తానుయొక్క ఫౌంజుదార్లకు రాజధానియైయుండెను. సుల్తాన్ ఇబ్రహీమ్ మొదట దనయన్న సుల్తానుగా నుండినపుడు అతని క్రౌర్యమునకు వెఱచి రామదేవరాయల సంరక్షణమున విజయనగరమునఁ గొంతకాలముండి యచట హిందువులతో మైత్రిఁజేసి తాను రాజ్యాధికారమునకు వచ్చినపుడు నయితము వారిని తక్కిన తురుష్కప్రభువులవలె బాధింపక యాదరించు స్వభావము గలవాఁడైయుండెను. ఈ వాడుక నతని సంతతివారును బాటించి హిందువులకుఁ దమసంస్థానములో గొప్పరాజకీయోద్యోగములనిచ్చుచుండిరి. వారిననుసరించి వారిసర్దార్లు కూడ నట్లె యొనరించుచుండిరి.

ఆకాలమున శ్రీకాకుళపు ఫౌంజుదారు కొలువులోనుండిన హిందూద్యోగులలో కలబరిగి శంకరాజీపంతులు ముఖ్యుఁడు. వీరియౌదార్యమును పౌరజనులకు వీరియెడఁ గలుగు ననురాగమును నటుండ నైశ్వర్యమునకు ధర్మశీలతకు వీరిప్రసిద్ధి సర్కారుసందంతట వ్యాపించినది. కలబరిగి వంశము మొదట బహ్మనీయ సుల్తానుల కొలువులోనుండి యాతురష్కవంశము నశించినపిమ్మట విజయనగర మాశ్రయముగలదియై సుల్తాన్ ఇబ్ర

హీముతోఁ గూడవచ్చి గోలకొండలో స్థిరపడినపిమ్మట నావంశములో నొకరగు నీ శంకరాజీపంతులు గారు దన పదునెనిమిదవయేట ఫౌంజుదారుతోఁ గూడ గోలకొండ నుండి లేఖకోద్యోగిగా శ్రీకాకుళమునకువచ్చి పంద్రెండేడులలో విశేషాభివృద్ధినంది ఫౌంజుదారునకు మిక్కిలిచనవరులలో నొకరయ్యెను. మనమిపుడందికొనిన కాలమున కీతఁడు సౌఖ్యముగఁ గాపురము చేయుటకుఁ దగినసాధనములను శ్రీకాకుళమున నే కూర్చుకొనినప్పటికి వలనుపడినయెడఁ దనకాపురమును గోలకొండకే మార్చుకొన నుద్దేశము గలవాఁడై దానికి వలయు ప్రయత్నములను గావించుచుండెను.

ఒకానొక సమయమున మనోహరమైన చైత్రారంభమున వెన్నెలరేయిఁ జల్లగ గాలి వీచుచుండఁ బెరటివాకిట పూలతోట కెదుట నొక కవాచీమంచమున బాలీసుపై నొరగి శయ్యపైఁ గూరుచుండి యెదుటనిల్చి యొకపరిచారకుఁడు తమలపాకుల మడుపులుచుట్టి యందియిచ్చుచుండ శంకరాజీపంతులుంగారు దనభార్యతోఁగూడ నేదో లోకాభిరామాయణమున వినోదింపసాగిరి. వా రపుడందుకొనినసంభాషణ వారి నిద్రాసమయమును మఱపించి, ఇతరేతరమును వారికి హెచ్చరిక చేయవలసినదేకాని వారు కూరుచుండిన యరగడియలోనే యొకభటుఁడు "బాబు! నజీబు తమకొరకు దేవిడివొద్ద నిలిచియుండెను" అనియరచుచు వీధిలోనుండివచ్చెను. వెంటనే యాప్రసంగమును విడిచి,

శం—నజీబెవరు ? ఎందుకో కనుగొనినావా ?

భటుఁడు—ఫర్మానా తెచ్చినాఁడు తమకు.

శంక—హుజూరునుండి యేదోమావిషయమై హవేలీకివచ్చిన ఫర్మానాయై యుండును. వేగమురమ్మను.

నజీబు—(భటునిమాట మీద వేగముగవచ్చి సలాముచేసి శయ్యపైని ఫర్మానానిడి) సాహెబ్ ! ఇనాం ఇనాం.

శంక—(తనభటునిజూచి) ఓయి ! ఈనజీబునకు కచేరీచావడిలోనికిఁ దీసికొనిపోయి మాఖానికీ గుమస్తాకుఁజూపి పదిరూపాయలను చిరాను ఖర్చువ్రాసి యిమ్మన్నామని చెప్పుము.

భటుఁడు నజీబును దీసికొనిపోయినపిమ్మట ఫర్మానాను దీపమువెలుఁగునఁ జదివి శంకరాజీ మందహాసముతో కాకితమును మడఁచి శయ్యపైనుంచుచుండ నతనిభార్య యిట్లుపలికెను.

"ఏమినవ్వుచున్నారు ? హుజూరునుండియె కదా ?!"

శంక—అవును మనకోర్కి యిన్నాళ్లకు సిద్ధించినది.

భార్య —(ఆత్రముతో) ఏమిటి? ఏమిటి ?

శంక—శీతము రెట్టింపుతో హుజూరునకు రమ్మని సెలవయినది. ప్రయాణములో మనకొఱకు రెండు లొట్టియలకును రెండు గుఱ్ఱములకును నొకపల్లకికిని హుకుమయినది.

భార్య—ఇక్కడనిన్ని భూములు సంపాదించుకొనియున్నాము. వానిమాటో ?

శంక—సర్కారులో దాఖలుచేయుదము. తరువాత హుజూరులో దరఖాస్తు చేయవచ్చును.

ఇట్లా రాత్రి కొంతసేపు వరకును నత్యుల్లాసముతో ముచ్చటించి సుఖముగా నిద్రించి తెల్లవారఁగానె లేచి శంకరాజీగారు తనఫర్మానా సంగతిని ఫౌజాదారుతో మనవి చేయుటకు హవేలీకి నరుగుటకు దుస్తులను బూని కచేరిచావడిలోకి రాఁగానె తమగుమ్మము ముందర వీధిలో విశేషమయిన బరువుతో నొక యొంటె నిలువఁగాఁ బరికించి కారణమును దెలిసికొనుటకు గుమ్మములోకి రాకమునుపె బక్కచిక్కినయొక యవనాశ్వమునుండిడిగి ముప్పదియైదున కొకటిరెండేడులు దక్కువప్రాయమున నుండిన యొక పురుషుఁడు గుమ్మమున కభిముఖముగావచ్చెను. అతఁడు ధరించిన షరాయి, యంగరకా, జలతారల్లిక పనిగల తాజును నతఁడు మహమ్మదీయస్థానమున నుద్యోగియని తెలుపుచున్నవి. అతని కోరమీసలను బట్టియు చక్కగ దిద్దఁబడి కత్తిరింపఁబడిన గడ్డమును బుగ్గమీసలును బట్టియు నదుట దిరుచూర్ణ రేఖ లేకపోయిన యొడ నతనిని మహమ్మదీయుఁడనియె యనుకొనవచ్చును. దూర యాత్రాయాసమున నతని యాకారసౌష్టవ మించుకతగ్గి యతనియందు నైసర్గికముకాని బలహీనత గానవచ్చుచుండెను. శంకరాజీ పంతులితనిని జూడఁగానె గుఱుతుపట్టలేకపోయెనుగాని ద్వారమునకావల పాదరక్షలను విడిచి తన్ను సమీపించఁగానె యొకమాఱు పరికించి తెలిసికొని యిట్లు పలుకరించెను:

శంక—మాధవరావు కక్కగారు! మీరా ? ఎన్నిరోజులకుఁ గలిసికొనినాము! ఎంత సంతోషకరమయిన రోజు!

మాధవరావు—అవునోయి. శంకరాజీ! మీయయ్యగారు చనిపోయిన క్రొత్తరికముననె మనము నౌకరీలకు స్వదేశమును విడిచినాము. మీయమ్మగారు సురక్షితముగా నున్నారా?

ఈప్రసంగ మింతవఱకు జరగఁగా నరుపదికిమించిన యొక వితంతుకాంత "మాధవరావు! నిన్ను మఱలఁ జూచినాను! ఎక్కడఢిల్లీ! ఎక్కడ శ్రీకాకుళము!" అనుచు రాఁగా ముగ్గురును లోపలికరిగి యొకచోట విశ్రమించిరి. ఆవచ్చిన వితంతుకాంత

శంకరాజీతల్లి; మాధవరావు సవతి యన్నభార్య ; ఈమె పేరుశాయమ్మ. ఈమెమాధవరావునుశంకరాజీని సమానానురాగముతోఁ బెంచినది. ఈమువ్వురును జిరకాల మొక్కరుని పోష్యవర్గములో నుండినవారు. వారువిశ్రమించిన పిమ్మట శంకరాజీ యిట్లుముచ్చటించుట కారంభించెను.

“అమ్మా! కక్కాగారిని చూడఁగానె పోల్చినావా?”

శాయమ్మ—అయ్యో! నాయనా! ఎంతమాటోయి! తల్లిచచ్చిపోయిన చిన్నకందును బెంచినాను. మీయప్పగారికి సవతితమ్ముఁడేకాని యెప్పుడైన సవతితమ్మునిలాగున వారు చూచినారా!

మాధవరావు—నాయభివృద్ధికి మీరును అన్నయ్యగారును కారణము. ఎంతదూరమున నున్నను మిమ్మునుమాత్రము మఱచిపోను.

శాయమ్మ—నాయనా! మాధవ! నేను ఏమి చేయఁగల్గితిని? మీయన్నగారు చనిపోయిన రెండు సంవత్సరములలో యదాయదలు చెదాచెదలు అయిపోయినాము. లెక్కలేకుండ నార్జించి మన నిమిత్తము విశేషముగ వ్యయపఱిచినారుకాని మీయన్నగారికి ముందుజాగ్రత లేకపోయినది.

మాధవరావు—లేకపోలేదు. లోకములో జీవయాత్రను సౌఖ్యతరముగా జరుపుకొనుటకుఁ దగిన సామర్థ్యము మాకుఁ గలుగునట్లుచేసినారు. మాకాయన యెంత విత్తము వదలిపెట్టిన దీనితో సాటియగును? ఆశ్రయించినచోట ఘనముగా బ్రతుకుచున్నాము కదా!

శాయ—పోనీ; నాయనా! ఎంతదూరముగా నున్నను నలుగురునుబాగున్నారు. నాయనా! నీకేమయిన సంతానమా?

మాధవ—లేదు లేదు.

శాయ—అయ్యో! వంశానికిద్దరున్నారని సంతోషించుచున్నానంటే నీకును లేదు శంకరాజీకిని లేదుపిల్లలు. అన్ని సదుపాయములు ఎంతో అదృష్టవంతులకుఁగాని జతపడవు. శంకరాజీ! మీపినతండ్రిని కలిసికొని చాల కాలమయినది. కష్ట సుఖములు మాటాడుకొండి ఒకగడియ.

అనిపలికి మఱియొకపనిమీద శాయమ్మ యరిగిన పిమ్మట మాధవరాయఁడును శంకరాజీయును నడుమ నించుకసేపు నిలిచిన ప్రసంగమును మఱల నందుకొనిరి:

శంక—కక్కా! సమీపించు చైత్ర బహుళ పంచమికి మన మెడసి పంద్రెండేండ్లగును. ఒకరివార్త యొకరికిఁ దెలియలేదుకదా?

మాధవ—ఎట్లు తెలియును? మొగలాయి ప్రభుత్వములో నేనుంటిని గోలకొండ

ప్రభుత్వములో నీవుంటివి. షహాజహాను ఫాదుషాగారి ప్రభుత్వములో హుజారు నవుకర్లకు సెలవు దొరకుటయె దుర్లభము. నాయదృష్టవశమున సెలవు దొరకఁబట్టి దాక్షిణాత్య పుణ్యక్షేత్ర యాత్రల కిట్లు బయలుదేరి వచ్చినాను. ఈయాత్రలో గోలకొండఁ జూచినాను; సుల్తానుగారి దర్శనమయినది. వారి రాష్ట్రములో నాప్రయాణమున్నంతకాలము నాకుఁ గావలసిన సదుపాయములను వారి ఫర్మానాను బొందినాను. మన బంధువులను బాల్యస్నేహితులను అందరిని జూచినాను.

శంక—సుల్తానుగారి దర్శనమయినదా? మనకుటుంబమందువారి కభిమానమును గౌరవమునుఉండుట యరుదుకాదు. నాకు జీతము రెట్టింపుపయిని హుజారునకురమ్మని పర్వానావచ్చినది. ఇదివరకు మీతో చెప్పమఱచితిని.

మాధ—సుల్తానుగారికి నిన్ను హుజారునకు రప్పించు నుద్దేశమున్నట్లు నాతో సెలవిచ్చినారు.

అని యిట్లనేక సంగతులను మాటాడుచుండ నాపూట శంకరాజీ తాను హవేలీకి వెళ్ళ నుద్దేశించికొనిన సంగతిని మఱచిపోయెను. చిరకాల సమావేశమునం బొడమిన యౌత్సుక్యమున నిట్లాసాయంతనమున వారిరువురును మాటాడినపిమ్మట శంకరాజీ తాను నెలరోజులలో గోలకొండకు బయలుదేరుటకును పదిరోజుల వఱకును మాధవరాయఁడు శ్రీకాకుళముననె యుండుటకును నేర్పఱచి రాత్రిభోజన మయిన పిమ్మట ఫౌంజుదారును దర్శింపఁబోయెను.

ఆఱవ ప్రకరణము.

ఆలోన నొకనాఁడు సంజ మిక్కిలి యింపుగ నుండెను. పవలెల్ల నిప్పులంజెరగుచుండిన గాడ్పుల కులికియును నెండవేఁడిమి కోర్వలేకయు గృహములను జల్లనిపందిళ్ళను జెరటి తోటలలోని చల్లనిచెట్లనీడలను నలంకరించిన జనము నప్పుడప్పుడె మెల్లమెల్లగఁ జల్లచల్లగఁదట్టి మీమీయిచ్చులఁ గ్రుమ్మరవచ్చుంబొండని యొసకొల్పనోయున నిసువుగాడ్పులు వీవసాగెను. ప్రొద్దు గ్రుంకువరకును వైతరణింగావరసి డాయఁబోని వారె యంతకంతకు మిసువాకంగాఁ బొగడుచు లాంగలీనదిం జెరలాడసాగిరి. కలంగని కొలఁది నీటియందు ప్రతిఫలించిన సంజ కెంజాయ యేటిసిరికిని సాటిలేని క్రొసేతనొసంగుచుండెను. అట్టియెడనొకగదిలో నురటిక్రిందఁ జెరియొుక మంచమీదనుండియు మాధవరాయఁడును శంకరాజీయును నిదురలేచి కట్టు బట్టలతోఁగూడ నీరాడి యొడలు దుడుచుకొని యిట్లు ముచ్చటింప సాగిరి:—

రాజా రామమోహనరాయలు.

[ఈ క్రిందియుపన్యాసము కాకినాడ ప్రార్థనాసమాజమువారిచే 25 వ సెప్టంబరు తేదిని జరుపఁబడిన రామమోహనరాయ సాంవత్సరికోత్సవమునాఁడు, చదువఁబడెను.]

పితృదేవతారాధనమున హిందువుల మించినవా రెవ్వరును లేరని మే॥ మేక్సుముల్లరు కొంతకాలముక్రిందట వ్రాసియున్నాఁడు. భరతఖండమునకు పెక్కువిధముల మహోపకారియై, ఏక దైవోపాసనమును మరల నీదేశమున నెలకొల్పిన మహావీరుఁడగు రాజా రామమోహనరాయని మృతతిథి జరుపుట కిచ్చట మన మందఱము కృతసమావేశుల మైతిమి. అతని పేరు చెప్పి పిండివంటలతో భోక్తల కర్పించుటకును, చుట్టపక్కము లందఱుఁజేరి కడుపార భుజించి గఱ్ఱున త్రేన్పుటకును సంకల్పించి మనము చేరలేదు. బ్రహ్మసమాజపితలలో నొకఁడైన రామమోహనుని మహాకార్యములఁ దలపోసి, అట్టివాని మానసికముగ కొనియాడి, సంతుష్టుల మగుదము. సామాన్యముగ జనులందఱు అనుకొనునట్టులు బ్రహ్మసమాజ మీదేశమున 1828 వ సంవత్సరమున స్థాపింపఁ బడలేదు. భగవద్గీతా భాగవతముల కాలమునాటి దీమతము. ప్రహ్లాద, నారద, వామదేవులు, జనకుని సందర్శించిన తొమ్మండ్రు మునీశ్వరు లీసమాజములోని వారే. వారి కాలమునుండి, నేటివఱకు "ఏకమేవా ద్వితీయ" మను వాక్యమును నమ్మి ధన్యులైన సాధులు, యోగులు, గృహస్థులు పెక్కండ్రు గలరు. అట్టివారిలో రామమోహనరాయఁ డొక్కఁడు. బహు మతములకు, మత సిద్ధాంతములకు, సమస్త వర్ణముల వారిచేతను వందనీయులైన మతబోధకులకు జన్మస్థానమైన యీదేశమున, మతావేశము మనకాలమునఁగూడ చల్లారనందుకు, స్వామి నారాయణ, కేశవ చంద్రసేన, దయానంద సరస్వతి, రామకృష్ణ పరమహంసలే సాక్షులు. మహానుభావత్వమును కడవఱకు మాపఁగల్గినఁగాని నెవ్వానిని మహానుభావుఁ డనఁదగదు, కావున, మరణానంతర మందఱిచే సంభావింపఁబడఁ దగిన లక్షణము లెవ్వియుండిన పురుషుఁడు మహానుభావుఁ డగునో వాని నేఁ డాలోచింతము. మనమాతా పితలయొక్కయు, పితామహీ పితామహులయొక్కయు, ఇతర బంధువులయొక్కయు తద్దినములఁ బెట్టునప్పుడు, వారు మహనీయులా! కారా! యను నంశము విచారణీయము గాదు. మన జన్మకారణులైన మనమాతాపితలు వారియందే లోపము లున్నను, మనగౌరవమునకు పాత్రములు.

మనకుఁ గల దంతయు వారిమూలముననే లభించినందున, కృతజ్ఞతా సూచకముగ వారి సంవత్సరమున కొకసాఁడు భక్తి విశ్వాసములతో నమ్రులనై పూజించుట విధి. దేశమునఁ బుట్టినవారిలో మహనీయులై, ప్రజ లందఱిసన్మానమున కర్హులై, వారి జ్ఞాపక సూచకముగ నీవిధముగ బహిరంగముగ నుత్సవములను జరిగించుటకు, వారి కుండవలసిన ప్రధానలక్షణము లెవ్వియని శంక పొడముచున్నది. ఈవిషయమును కార్లైలు, ఎమర్సనులకంటె సమాకల్యముగ విమర్శించి వ్రాసినవారితరులు లేరు. "ఏగుణము ప్రధానముగ నుండిన నరుఁడు గొప్పవాఁడై, వాని నామమును మఱవకుండ ప్రజ లేచేట నొక్కసారిరైన కృతజ్ఞతాపూర్వకముగ స్మరించుచుందు"రనువిషయ మా గ్రంథముల చక్కఁగా వివరింపఁబడి యున్నది. సంకల్పనిర్వహణోత్సుకత, సత్కార్యధురీణత ప్రధానములని కార్లైలు చెప్పుచున్నాఁడు. దీనివాస్తవము స్వానుభవము వలన మన మందఱ మెఱిఁగినదగుటచే శంకింపఁజాలము. ఈజగన్నాటకమున మనమందఱమును కొద్దిగానో గొప్పగానో శక్తికొలఁది కలాపమును వినిపించుచున్నారము. జ్ఞానులమైనను అజ్ఞానులమైనను మన కందఱకు చెఱియొక నాటకరంగ మున్నది. ప్రజ్ఞానుసరణముగ వేషముల ధరించి, నర్తకులమై, మనము రంజిల్లుచు, నితరుల కొంతవఱకు రంజిల్లఁ జేయుచున్నాము. విశ్వప్రవృత్తికొఱకు ధరించువేషముల నూడ్చి మనమొంటరిగ గదిలోఁజేరి మన వ్యాపారములఁగూర్చి తలపోయఁ జొచ్చితిమేని, మన కపటవర్తనమునకు మనమే యాశ్చర్య పడుదుము. మనవ్యాపారము లన్నియు కపటములే. అంతయు కల్లయే. కావున, సంకల్పనిర్వహణోత్సుకతయు, సత్కార్యధురీణతయు లేకుండిన నే మనజుని నడవడిక గాని శ్లాఘాపాత్రము గానేరదు. మనలో నిష్కల్మషసంకల్పము, కర్మశుద్ధి పలువురిలోఁ గానరావు. మహనీయులనుగాఁ బరిగణింపఁబడఁదగినవారియందీ శుభలక్షణములు ప్రాముఖ్యముగ నుండును. సమయానుసరణముగ మనలో కొందఱీలక్షణముల స్వలాభాపేక్షులై యవలంబించి, కార్యాంతమున విసర్జించి నిజస్వభావమును బయల పెట్టుదురు. ఆజన్మాంతము సంకల్పనిర్వహణోత్సుకత, సత్కార్యధురీణత మనకలభ్యపదార్థములు వాంఛితార్థములునై యున్నవి. మహానుభావు లనిపించుకొనినవారు ప్రతిదేశమునఁ బుట్టి, యీ గుణోన్నతిచే ప్రసిద్ధి గాంచిరి. జర్మనీదేశమునఁ బుట్టి పోపుల గర్వపరిహారముచేసిన లూథరు, సమకాలీనులైన యిరాజామసు, (Erasmus) మిలాంకథన్ (Melancathon) లకంటె నెక్కుడు పండితుఁడుగానున్నను వారియందు లేని పైరెండు గుణము లీతనియందు బలీయముగ నుండుటచే లోకమున కుపకారియై కీర్తిశేషుఁడయ్యెను. మన మందఱమనావశ్యకముగ లేనినిర్బంధముల గల్పించుకొని, మనకు స్వేచ్ఛానువృత్తి లేదని వగచుచుందుము. పరోపకారచింతగలవారి

బాధకము లెట్టియుఁ గానరావు. దీని కింకొక నిదర్శనముఁ జూపెదను. ఒక కసాయి వానికి పదేడుల పుత్రుఁ డుండెను, వానికి తన వ్యాపారమును నేర్ప తండ్రి యత్నించి కత్తిని చేతఁబూని దాని నుపయోగించువిధమును జూపి, ఆచొప్పున ప్రాణవధఁ జేయు చుండుమని చెప్పఁగా "జ్ఞానేంద్రియ సంయుక్తమైన యీదేహముపై దీనిని ముం దుపయోగించి నాకు బాధకముగ నుండునో లేదో గ్రహించినఁగాని, యీకత్తిని నోరులేని యీజంతువుపై నుపయోగించన"ని చెప్పి, తన శరీరమున చిన్నగాయముఁ జేసికొన, దానిబాధ దుస్సహము కాఁగా, వాఁ డావృత్తిని మాని తన కులధర్మమును త్యజించి, తుదకు పరమ యోగులలో లెక్కకు వచ్చినాఁడు. అట్టి మనోనిశ్చయమే, ఉత్తమ పురుష లక్షణము. అట్టివారికి జనసామాన్యమున కున్నస్థూలదృష్టి యుండ వలెను. ఏసామాన్య విషయమునఁగాని వారికిఁ దోచునభిప్రాయములు మనకుఁ దోచువానికన్న వేయి మడుగులు, గంభీరముగను, స్థిరముగనునుండును. మనకు కనపడు వస్తువులయొక్క యథార్థస్థితిని కనిపెట్టుసామర్థ్యము మనకుపట్టుపడ లేదు. ఇదియేవారియందుఁగలరెండవ గుణసంపద. ఇఁక మూడవ శుభలక్షణము వారి యాకర్షణశక్తి. ఎవ్వాఁడు తన వచోనైపుణ్యముచేతను, ఋజుప్రవర్తనమువలనను, పరోపకారదీక్షవలనను, లోకుల నాకర్షించి, కొందఱినైన తన సన్మార్గమునకుఁ ద్రిప్పఁజాలఁడో వాఁడు గౌరవనీయుఁడు కానేరఁడు. ఎవ్వాఁడు సర్వదా యొంటరిగ కాలము గడపి, నలువుర తనమార్గమునకుఁ ద్రిప్పి ధన్యులఁజేయజాలఁడో వానిబ్రతుకునిరర్థకము. దుష్పథమున కవలీలగఁ ద్రిప్పి కొంపలగుండములనేయు ధన్యులనుగూర్చి మన మిచ్చటఁ దలఁచుచుండుటలేదు. అట్టివారు, ప్రతిగ్రామమున, పట్టణమున, దేశమున గణనాతీతముగ నున్నారు.

సత్యాభిరతి, మహాకార్య నిర్వహణశీలత, నీతిప్రవర్తనము, సోదరభావము, ప్రేమపూర్వ కాదరణము, మహానుభావులగువారి సొమ్ములై యున్నవి. దర్శనమాత్రముననే వందలకొలఁది జనుల వ్యామోహితులఁ జేసి ప్రపంచమున నేమతమునకు లేని యాధిక్యమును దెచ్చిన బుద్ధునిచరితమును జదివితిమా, ఆతనియందు పైగుణములను బట్టియే, ఆతనిబోధనల కంతప్రసిద్ధి గల్గెనని, తెలియ నగును. మహమ్మదునిస్థితియు నిట్టిదే. బాల్యమున చదువులేక త్రిమ్మరి, మతముమాట స్వప్నముననైనఁ దలఁచి యెఱుఁగక, నలువదవ యేట హఠాత్తుగ మతబోధ కారంభించి నానావిధహింసలకు లోనై, తుదకు ప్రాణరక్షణార్థము మక్కాకు పాఱిపోవలసివచ్చెను. కాని యాతని బోధనలకు స్త్రీపురుషు లుత్సాహముతోఁ జెవియొగ్గి విని, యిరువదేడులలో, గొప్ప మతమును రాజ్యమును స్థాపింప సమర్థులైరి. సంకల్పనిర్వహణోత్సుకత, సత్కార్యధురీణత, స్థూలదృష్టి, ఆకర్షణశక్తియు నెవ్వనియందు సమకూడునో వాఁడు మహనీయుఁడు కాకమానఁడు.

ధనము, విద్య, ప్రయోజకత్వము, బుద్ధికుశలతవీనివలననే, ఎవ్వఁడును గొప్పవాఁడు కాఁడు. పేదవాఁడైనను ధనికుఁడైనను, విద్యాసంపన్నుఁడైనను విద్యావిహీనుఁడైనను, వ్యాపారమందున్నను లేకున్నను, ప్రయోజకుఁడైనను కాకున్నను, పూర్వోక్త సుగుణజాలములచే నలంకృతుఁడే మహానుభావుఁ డగును. ఇఁక రాజా రామమోహనరాయఁడు మన సన్మానమున కర్హుఁడా? పైలక్షణములు కొన్నియైన నాతనియందుండి, బ్రహ్మసమాజమత స్థాపకుఁ డనిపించుకొనఁదగినవాఁడా యనువిషయము నాలోచింతము. ఆతఁడు1774 వ సంవత్సరమునఁబుట్టి, 1833వ సంవత్సరమున మృతినొందెను. బ్రాహ్మణకులసంభూతుఁడు. తల్లివంక వారు శాక్తేయులు, తండ్రివంకవారు చైతన్య వైష్ణవులు. శివకేశవుల కిరువురకు పరస్పరభేదములేక సఖ్యముగ నుండినను, వారిభక్తులు గ్రంథములలో వైషమ్యమును కల్పించి తాము దానికి ప్రత్యక్షప్రమాణముగ నుండుట జగదీశ్వరునకు గిట్టక, వారిరువురకు మరల సంయోగము గలిగింపనోయన రామమోహనరాయల నిట్టి దంపతుల గర్భమునఁ బుట్టించినాఁడు. ఆకాలమున పాఠశాలలు కాలేజీలు లేకుండుటవలన, నీతఁడు పండెండ్రవయేట నే స్వగ్రామమును వదలి, పాట్నాలో అరబ్బీ ఫారసీభాషల నభ్యసింపఁ బోయెను. పదునాఱవయేట కాశి కేగి, వేదశాస్త్రార్థములను గ్రహించు నిచ్ఛతో సంస్కృతమును పఠించెను. ఈచొప్పున నరబ్బీ ఫారసీ సంస్కృత మతగ్రంథముల, మూలములను జదివినవాఁ డగుటచే, పదునాఱవయేట నే, భయాస్పదదురాచారదూష్యమగు విగ్రహారాధనము నింద్యమని గ్రహింప సమర్థత గల్గెను. విగ్రహారాధనము దేశమం దంతటను వ్యాపించియున్నను, కాళికోపాసనమువలన వంగదేశమున విగ్రహారాధనాదౌష్ట్యమును నైచ్యమును పూర్ణదశకు వచ్చినవి. అట్టి యారాధనము నింద్యమని నిరాకరింపఁగల సామర్థ్య మాతనికి పదునాఱవయేట నే గల్గఁగా, మనకు ముప్పదేఁడులు దాటినను, షష్టిపూర్తియైనను కలుగకున్నది. పురాతనాచార నిరాకరణమునకు తండ్రి కుపితుఁడై పుత్రుని నింటినుండి వెడలఁగొట్టి నందున తిన్నగ టిబెటియమున కేగి నాలుగేం డ్లక్కడిబౌద్ధులతో సహవాసముచేసి బౌద్ధమత సిద్ధాంతముల ససాకల్యముగ నేర్చుకొనెను. కొమారుఁ డీచొప్పున నాలుగేఁడులు దేశాటనము చేయునప్పటికి తండ్రికి తొలియాగ్రహ ముపశమిల్లి మరల తనగృహమున కాతఁడు రా నంగీకరించెను. ఇరువదవయేట నాంగ్లేయవిద్యాభ్యాసమున కారంభించి యిరువదైదవయేటికి దాని సమాప్తి గావించెను. అప్పటినుండి నలువదియేఁడులు వచ్చువందాక ఆంగ్లేయ ప్రభుత్వమువారి కొలువున నుండి కలెక్టరుని శిరస్తదారీవఱకు చేసి, పనిచాలించుకొనెను. బడ్జిపురపు జిల్లా శిరస్తదారునివలె మండలమున తా నొక్కఁడే సత్ప్రవర్తనుఁడవని మిగతవారందఱు దొంగలని చెప్పి కలెక్టరును మోసపుచ్చి, రెండవవారిని వానిచెంతకుఁ బోకుండ భద్ర

…చెనో, అయుద్యోగ ధర్మముచొప్పున తంత్రముచే ప్రధానముగా నెంచుచు సహవాసదోషమున మడత నాలుకవాఁడై వ్యవహరించెనో, యాతనినిచరిత్రకారు లెచ్చట నుదాహరింప రైరి. పనిని చాలించుకొనిన వెనుక కలకత్తానచ్చి మరణకాలమువఱకు నిరామయముగ దేశాభివృద్ధికొఱకు పాటుపడ నారంభించెను. అయిరువది యేఁడులలో నాతఁడు చేసిన జనోపయుక్తకార్యములలో మనలో ప్రముఖులమని తిరుగువారు జీవితకాలమంతటను శతాంశమైన చేయలేదు. ఒకవంక సంఘసంస్కారణముకొఱకు, ఒకవంక పరిశుద్ధాస్తికమతస్థాపనముకొఱకు, మఱియొకవంక రాజకీయవిషయవిచారణముకొఱకు శ్రద్ధతో సదా పాటుపడుచుండెను. ఈమూఁడువిషయముల నాకాలమున నొక్కఁడే చేపట్టి నిర్వహింపఁగల్గియుండఁగా, నిర్బంధము లన్నియు నివారణములై స్వేచ్ఛానుసరణమునకు వలయుసదుపాయము లున్నయీకాలమున, మనవా రూఁగులాడుచు, కాలమును వ్యర్థపుచ్చుచు న్నందుకు మనము సిగ్గుపడవలసి యున్నది. ఆకాలమున ప్రబలియున్న దూష్యాచారములలో బహుభార్యాత్వ, సహగమనము లాతనిదృష్టి నాకర్షింపఁగా, వాని నివారణముకొఱకు విశ్వప్రయత్నములఁ జేసెను. 1818వ సంవత్సరము మొదలు 1828వ సంవత్సరము వఱకు సహగమనవిషయమున నీతఁడును ద్వారకనాథ ఠాకురును కలిసి పాటుపడి దొరతనమువారికి సహాయభూతు లైరి. ఈతఁ డొనర్చిన సహాయమునుగూర్చి వుల్లియంబెంటిక్కు ప్రభువు చాలగ వ్రాసియున్నాఁడు. పిమ్మట కొంతకాలమువఱకును ఢిల్లీచక్రవర్తికి వకీలుగా నుండి, అతని వ్యవహారముమీఁదనే యింగ్లండునకుఁబోవలసివచ్చెను. 1814వసంవత్సరముననే ప్రార్థనాసమాజమును స్థాపించి, యచ్చట హితులందఱును జేరి, మతవిషయముల ప్రసంగించుచు నీశ్వరుని ధ్యానించుచుండిరి. అప్పటినుండి యింగ్లండునకుఁ బోవువఱకు పురాతన హిందూమత సంరక్షణదక్షులతోడను, వారికన్న పట్టుదలగల క్రైస్తవులతోను, మతవిషయముల నెడతెగని సంవాదము జరుగుచుండెను. ఉభయమతములవారును తమపూర్వు లేర్పఱిచిన యుత్తమ మతసిద్ధాంతముల వర్జించి, విగ్రహములను, నరుని పూజించుటఁ జూచి జాలిపడి, వారి కుచితమైన యుపాసనావిధమును బోధించెను. జరుగుచున్న వ్యాపారమున కేమాత్రము భిన్నముగ నెవ్వఁడు ప్రవర్తించిన దాని మంచిచెడ్డలవిచారించు శాంతము మనదేశీయుల కిప్పటివఱకు పట్టువడమిని తమచేతనైన పనియగు బహిష్కారమును ముందు గావించిరి. దానికి జంకక ప్రసంగములలోనికి దిగి సుప్రసిద్ధులగు పండితుల నందఱి నోడించి, పురాతనమతగ్రంథములు సాకారపదార్థపూజనమున కంగీకరింపవని చూపి వారల నొకవిధముగ సమాధానపఱచెను. ఆకాలమున కలకత్తాలోనున్న మిషనేరీలలో ప్రసిద్ధుఁడగు మేః ఆడమ్సు రామమోహనరాయలకు, క్రైస్తవ సిద్ధాంత

ములఁ బోధించి నమ్మింపఁ బ్రయత్నించి తుదకు త్రిమూర్త్యాత్మకమగు తన సిద్ధాంతము వదలి, ఏకదైవోపాసకుఁ డయ్యెను. బ్రహ్మమందిరమునకు వ్రాసిన "ట్రస్టుడీడ్డు"ను జదివిన నాతని మతాధిక్యమును, సర్వసమత్వబుద్ధియు విశదమగును. ఆమందిరము "విశ్వప్రపంచమునకు సృష్టిస్థితి కారణుఁడగు, శాశ్వత, అశోధనీయ, నిరంజన పురుషోపాసనము కొఱ కేర్పఱుపఁబడినందున, నామ, రూప, యవస్థా భేదములచే నితర పదార్థము నెద్దాని నచ్చట నెవ్వరుగాని పూజింపరాదనియు, ఆమందిరమున, యుక్తముగను, శాంతముగను, భక్తితోడను, సమస్తమతములవారు, జాతులవారు నిరాతంకముగ మతసభల జరిగించుకొనవచ్చు ననియు, అచ్చట నుపాసనా సమయమున, లోకమున ప్రస్తుతము మానవకోటిచే పూజింపఁబడుచున్న చేతనాచేతన పదార్థములనుగూర్చియు ముందు పురుషాంతరములవారు పూజ్యార్థపదార్థములనుగా నెంచుకొనఁబోవువానిగూర్చియు, ఏయుపాసకుఁడును, తృణీకార భావముతోను పరిహాసముతోను మాటాడఁగూడదనియు, ఉపన్యసింపఁగూడ దనియు, నియమించెను. దానివలన ప్రతి బ్రహ్మమందిరమున, హిందువులు, మహమ్మదీయులు, క్రైస్తవులు, పారసీలు, యూదులు, కలిసి నిరాక్షేపణముగ పరమేశ్వరుని నామసంకీర్తనము గావించి ధన్యులు కావచ్చును. ఎవ్వరిమనసు నొవ్వకుండ, ఏమత ధర్మముల దూషింపకుండ, ఎవ్వరి లోపముల వెలిఁబుచ్చకుండ, ఎవ్వరికిని లేని యాధిక్యము నీయకుండ, భ్రాతృభావముతో నుపాసించుట కిట్టి సాధన మన్యమతములలో లేనిమాట స్పష్టము. ఏమతమునుగూర్చి యచ్చట చులకనగ మాటాడఁదగదు. విద్యాధికులై సమస్తదేశములను, మతములను పావనములనుగఁ జేయ కంకణము ధరించియున్న క్రైస్తవు లీమాటను గుఱియం దుంచుకొని వారి దేవాలయములలో నుపన్యసించిన మేలగును. అస్సాము మొదలు క్వెట్టావఱకు, సీమ్లా మొదలు బెంగుళూరువఱకు, నాగరికతఁ జెందిన ప్రధాన పట్టణములలో, విద్యాధికు లందఱుఁ జేరి యాతని గౌరవార్థ మిట్టిసభలఁ జేయుటయే, యాతని యుపదేశప్రాముఖ్యమునకు నిదర్శనము. ఏవిషయమును చేపట్టినను, దానిని పూర్ణముగ పరిశీలించి విడుచువాఁ డగుటచేతనే, ఆతని మాటయందు మే. బెంతం, (Bentham) మే. మిల్లు, రాస్కో-కంపెనీ డిరక్టరులు, లార్డు వులియంబెంటికు, నాలవజార్జులకు గణ్యత యుండెను. సహగమన నిరోధన మాతని మూలమునఁ గాకున్న మనదేశమున నఱువదియై దేడుల క్రిందటనే జరుగకుండును. చిన్నతనమున సహగమన క్రౌర్యమును కన్నులారఁ జూచి, దానిని తన జీవితకాలమున మాన్పింతునని శపథ మూని పాటుపడుటచే, రాజా రాధాకాంత దేవు లోనగు ధనికులు, సమర్థులు దాని నిలుప యత్నించి విశ్వప్రయత్నములఁ జేసినను, విఫల మనోరథు లైరి. బంగాళమునందే సంవత్సరమున కించుమించుగ 600 మంది

నిర్దోషురాండ్రను మృతభర్తృక లగ్నిపాలు గాకుండ కాపాడిన పుణ్య మొక్కటియే చాలును. ఇట్లు కేవలము మతసాంఘిక విషయములలో కాలము సరిపుచ్చక, రాజకీయ విషయములనుగూర్చి శక్తికొలంది శ్రమపడఁ జొచ్చెను. 1833వ సంవత్సరమున, ఈస్టిండియా కంపెనీవారికి నీయవలసివచ్చినప్పుడు, పార్లమెంటు కమిటీవారి యెదుట నిచ్చినసాక్ష్యమును అతఁ డప్పటికాలపువారి పేర వ్రాసినయుత్తరములను జదివిన నాతనికి దేశాభిమాన మెంతవఱ కుండెనో తెలియఁగలదు.

ఇఁక నాతని మతోపదేశములనుగూర్చి కొంతవఱకు విచారింతము. ప్రజలలో నీతిబల దైవ భయములు లేకున్న నేకార్యముగాని తుదవఱకు కొనసాగదు. ఐహిక వాంఛలకొఱకు శ్రమపడు నాగరికులు, తుదకు నిరాశులై, మనస్స్వస్థతలేక కాలము జరుపుదురు. యూరపుఖండమున ధనికులు, విద్యాధికులు, తఱచుగ నాత్మహత్యలు గావించుకొనుటయు, ఉన్మత్త వైద్యశాలానివాసు లగుటయు, దీనికి తార్కాణము. జాతిమత భేదముల దొలఁగించినను, బాలికా వివాహకాలమును పదునాఱేండ్లుచేసినను, వితంతువివాహములకు కులగురు లంగీకరించినను, దొరతనమువారు గొప్ప యుద్యోగముల మన కొక్కసారిగ నిచ్చి రాజ్యపరిపాలనాదక్షులఁ జేసినను, భగవంతుని, అతనిచే సృజింపఁబడిన మనుష్యకోటిని సమానప్రేమచేఁ జూడవలెనను జ్ఞానము సామాన్యముగ నందఱికిని కుదిరినఁగాని ప్రయోజనము లేదు. అట్టిదానికి మంచిమత ముండవలెను. దానికొఱకే రామమోహనరాయలు పాటుపడెను. సత్యమే మతమం దున్న దాని నంగీకరించి, సత్యప్రతిపాదకులనెల్ల గౌరవించెను. మూర్ఖజనాభిప్రాయమును ప్రధానముగ నెంచి వారిచే శ్లాఘింపఁబడుట కభిలషింపనివాఁ డగుటచే, కొన్ని కష్టములకు లోనయ్యు, వాని లెక్కసేయఁ డయ్యె. అతఁడు స్థాపించిన బ్రహ్మమతము కొంతవఱకు దేశమున నాటుకొన్నది. భగవదనుగ్రహమువలన వర్ధిల్లఁగలదు. అతని ట్రస్టుడీడులో వ్రాసినచొప్పున, సమస్తమతములవా రొక్కచోటఁ జేరి యేకమనస్కులై లోకపితను గొలుచుకాలము రాకమానదు. పరమేశ్వరోపాసనమునకు వలయు మార్గములు సాధనములు పరిపూర్ణదశకువచ్చి, ఆత్మాభివృద్ధిని నిశ్శంకముగఁ బొందిన భరతఖండమునఁబుట్టినవాఁ డగుటచేతను, చిరకాలానుభవమునుబట్టి వ్రాయఁబడిన యుపనిషత్తులు, భగవద్గీతలు గలయీదేశమున జ్ఞానసంపన్నులు తొలుత నద్వితీయపరబ్రహ్మము నుపాసించి ధన్యులగుటను, అట్టి ధన్యత, క్రమపరిశ్రమమువలన వర్ణాధిక్యము, వర్ణభేదము లేకుండ, జానపదులందు, మృగయావినోదులందు, వనపాలకులందు, జాలరులందు, స్వర్ణకారులందు, మాంసవిక్రయులందు కానఁబడుచుండుటచేత జాతిమతభేదములఁ దొలఁగించి, బ్రహ్మణులను, పండితులను, యోగులను, సామాన్యజనులను

సమీపగులఁ జేసి దేశమున కాధిక్యముఁ దేవలెనని రామమోహనరాయఁడు సంకల్పించెను. ఇట్టి యుత్తమధర్మమును మన గ్రంథములు బోధించు చున్నవనియు, దీనిని చిరకాలము మనపూర్వు లాచరించి కృతకృత్యు లైరని యెఱిఁగియుండియు, పండితులు పామరులుకూడ క్రమక్రమముగ విగ్రహారాధకులై, నర మృగ ఖగసరీసృపములను, గ్రహకూటమును, పంచభూతములను, వృక్ష శిలాదులను, గణనాతీత కల్పితదైవములను, శక్తులను గొల్చుచు, ఘోరకర్మములలో మునిగి, మతముపేరిట దయాదాక్షిణ్యశూన్యులై, ద్వేషప్రధానులై సంచరించుచు దేశమును ఘోరకాంతారముగఁ జేసి, దౌర్భాగ్యస్థితికిఁ దెచ్చినందున, ఛిన్నుఁడై దాని పునరుద్ధారణముకొఱ కాతఁడు సంకల్పించెను. ఏకమేవాద్వితీయమని యుపనిషత్తు లొకవంక ఘోషించు చుండఁగా, అనన్య చింతనములేక యాతని పర్యుపాసనముఁ జేయుమని భగవద్గీతయొకవంక చాటు చుండఁగా, అనేక దైవతోపాసనమును నెలకొల్పఁజాలిన మనపూర్వుల ప్రజ్ఞకు వింతయగుచున్నది. లోకవృత్తము నెఱుఁగనిబాలునకు సహితము మన పూజావిధానముఁ జూడ సందేహములు గల్గుచుండఁగా, విగ్రహారాధనము దూష్యమని బాల్యముననే గ్రహించిన రామమోహనరాయలు దానిమాటను తలఁచుకొనినప్పుడెల్ల మనస్తాపముఁ బొందియుండును. మానసికోపాసనావిధమును పూర్ణముగ గ్రహింపని క్రైస్తవరాజ్యములలో, ఏకపురుషోపాసన మామతస్థాపనకాలమునుండియు నిరాతంకముగ జరగుచుండఁగా, అట్టియేక పురుషోపాసన యైన లేకుండ భిన్నదేవతారాధన మెట్లు మనదేశమున వ్యాపింపఁగల్గెనను శంక యాతని మిక్కిలిగ బాధించెను. ఈవిగ్రహారాధనమువలన భగవంతుఁడు స్వయముగ పాలింప లేని రాజై, వేర్వేరువ్యవహారముల వేర్వేరుమంత్రుల కప్పగించి, లోకమును వారివశముఁ జేయుటవలన, రాజకీయ వ్యవహారములలో, సుగుణులు దుర్గుణులునున్నట్లు, లోకపాలురలో కూడ క్రూరులు కరుణాపరులు చేర్పడిరి. దేవుఁడు వరమిచ్చినను పూజారి వరమీయఁ డనుసామెత చొప్పున నీక్రూరదైవతములపాపకృత్యములచేఁ దృప్తినొందించినఁగాని తరణోపాయము లేదను నమ్మకము బలీయముగా నుండుటచే, దురితదూరుఁడుగ నుండఁదలఁచిన భక్తుఁడు కూడ, మతముపేరిట దురితచరితుఁ డగుచున్నాఁడు. ఈదూష్యాచారముల మానవలెనని యభిలాషయున్నను, చిరకాలమునుండి వచ్చుచున్న యాచారముల మీఱినడువ సాహసములేక పాడగుచున్నాము. రోమనుకాథలిక్కులలో విగ్రహారాధన మున్నది. మిగత క్రిస్టియనులలో పుణ్యపురుషసమారాధన మున్నది. మహమ్మదీయులలో పీరుల నిలువఁబెట్టి యుత్సవము చేయుదురు. కాని, వీరందఱు వీనివలన నేకదైవోపాసనమునువదలి, వీనినే ప్రధానముగా నెంచి మనవలె జగదీశ్వరుని మఱవలేదు.

ఇంతవరకును నావిరికిఁ గొంతపనిని చేయఁగలసామర్థ్య ముండునా లేదా యను వంశమునుమాత్రమే విచారించు చుంటిమి గాని నిజమయిన యావిరి యంత్రమును గూర్చి ఏమియు విచారించు చుండుటలేదు. కావున నిఁక నిజమయిన యావిరియంత్ర స్వభావమును దెలిసికొనుటకై ప్రయత్నింతము.

నిజమయిన ఆవిరియంత్రముయొక్క వివరము.

ఈదినములలో పనిచేయుచున్న యావిరియంత్రము లనేకవిధములుగా తయారు చేయఁబడుచున్నవని ఇదివఱకే చెప్పఁబడి యున్నది. ఏయేపనుల కుపయోగపఱుపఁ బడుచుండునో యంత్రము లాయాకార్యముల కనుగుణముగా తయారు చేయఁబడు చుండును. సామాన్యముగా ధూమనౌకాయంత్రములం దయారుచేయునపుడు ముఖ్య ముగా తక్కువబొగ్గు కాలునట్లును, యంత్రభాగములు తేలికగను, ఇమిడికగను, ఉండునట్లును నిర్మింతురు. ధూమశకటయంత్రములలోని యంత్రభాగములు, తేలిక గను, ఇమిడికగను, ఉండునట్లును, ముఖ్యముగా ఆవిరి వేగముగను, అధికముగను, ఉత్పత్తి యగుచుండునట్లును కల్పింతురు. కర్మశాలాయంత్రములలో పైవాని కన్నను ముఖ్యముగా యంత్రములు చిరకాలము మన్నునట్లు చేయుచుందురు. ఐనను, ఈవివిధ యంత్రములలోని యంత్రభాగములయొక్క రూపములు మాత్రము కొంచెము భేదించి యున్నను, వానివలనఁ గలిగెడుఫలితములుమాత్ర మొక్కటియై యుండును. అందు వలననే మనము వీనిలో నేయంత్రమును గూర్చి యైనను బూర్ణముగా తెలిసికొనిన యెడలఁ దక్కిన యంత్రములనుగూడ నమర్చుటకును, పనిఁ జేయించుటకును, సామ ర్థ్యమును కలిగియుండుము. కావున నిప్పుడు కర్మశాలాయంత్రములలోని కెల్లను మిక్కిలి సులభ మగు నొక సామాన్యయంత్రముంగూర్చి ముందుగ వివరింపఁబడును. వీనిని రెండు ప్రధానభాగములుగా భాగించవచ్చును. ఈరెండుభాగములును బాన (Boiler) యంత్రము (Engine) అని వాడఁబడును. ఇందు ప్రథమభాగమగు బాన యందు ఆవిరి పుట్టుచుండును. రెండవభాగమగు యంత్రమునందియావిరి హెచ్చింపఁబడు చుండును, అనఁగా బలముగా మార్పఁబడు చుండును. బానయొక్కరూపము రెండు మూడు పటముల యందును, యంత్రముయొక్క ఆకారము 5, 6, 7 పటముల యం దును కనపఱుపఁ బడినవి. సామాన్యముగా కొన్నిచోట్ల బానయంత్రములను జత పఱిచి, యేకముగనే యుంచు చుండినను, పలుచోట్ల నవిరెండును వేర్వేరు గృహ ములయం దుంచఁబడి పని చేయింపఁబడు చున్నవి.

ఆ వి రి బా న.

ఈ యావిరిబానను తిరిగి రెండుభాగములుగా విభజింపవచ్చును. ఇందొకభాగము పొయ్యి (Furnace) యని పిలువఁబడును. ఈపొయ్యియందే నిప్పులుండి లోననుండి నీటిని మరిగించు చుండును. రెండవది బానలో నీ రుండుస్థానము. (బొం 3) ఈనీరు, క్రింద పొయ్యిలో నుండు నగ్నిజ్వాలలవలన మరిగియావిరిగా మారుచుండును. ఇట్లు త్పన్నమగు చుండెడి యావిరి యీబాననుండి యంత్రమున కాయావసరమైనగుణ ముగా కావలసియుండునంతవట్టున కొకయావిరిగొట్టము (Steam pipe) మూల మునఁ బంపఁ బడుచుండును, ఇఁక నిం దుండెడు అంతర్భాగములు ముందుక్రమముగా వివరింపఁబడు చుండును.

ఆ వి రి యం త్ర ము.

ఈయావిరియంత్రముకూడ కూజా, ప్రాథమికమండలము, ప్రక్క కప్పులు (Side Valves) అని మూడువిధములుగా భాగింపవచ్చును. ఇందలి కూజా వెనుకటి శోధనయంత్రమందలి కూజావలె నెక్కువ పొడవుగలిగి యొకవైపున తెరువఁబడి యుండక, మితమైన పొడవుగలిగి రెండు వైపులను మూయఁబడి యుండును. దీని పొడవు సామాన్యముగా లోనిరంధ్రముయొక్క వ్యాసము (Diameter) నకు ద్విగుణ ముగా నేర్పరుపఁ బడుచుండును. వెనుకటిరీతిని కూజాలోనే నీళ్ళుపోసి యావిరిగా మార్చుకొనక అందుకై ప్రత్యేకముగా నేర్పఱచుకొనిన యావిరిబాననుండి యావిరిని ఈకూజాలోనికి తెచ్చుకొను చుందురు. దీనిలోనికి ఆవిరి వచ్చుటకు 6 వ పటమున కనుపఱచఁబడిన రీతిని కూజాయొక్క యొకప్రక్కను రెండుతుదలను రెండు S S లను మార్గము లేర్పర్చఁబడి యుండును.

ఈకూజాలోనికి పంపఁబడు ఆవిరి వెనుకటిరీతిని ప్రాథమికమండలముయొక్క యొకప్రక్కనుమాత్రమే యుపయోగపర్చఁ బడక రెండుప్రక్కలను గూడ నుప యోగ పరుపఁబడు చుండును. అనఁగా:—ప్రాథమికమండలముయొక్క యొక వైపు నకుఁ క్రొత్తయావిరి వచ్చి త్రోయుచుండునపుడు రెండవ వైపుననుండు పనిచేసిన పాతయావిరి వెలుపలకుఁ బోవుచు, రెండవ వైపునకుఁ క్రొత్తయావిరి వచ్చి త్రోయు చుండునపుడు మొదటిప్రక్కనుండు పనిచేసిన పాతయావిరి వెలుపలకు తప్పించు కొని పోవుచుండుటచేఁ బ్రాథమికమండలమును కూజాయొక్క యొక చివరనుండి రెండవ చివరకు ఎడతెగక తిరుగుచుండునటులు చేయును.

ఆవిరి యీకూజాయందుఁ బ్రాథమికమండలముయొక్క యేదో యొక వైపున పనిచేసినపిమ్మట నయ్యది వ్యయపుగొట్టము (Exhaust Pipe) మూలమున బహిర్వాయువునకుఁ గొనిపోఁబడుచుండును. కొన్ని గొప్పయంత్రములయందీవ్యయపుగొట్టము బహిర్వాయువునకు విడిచిపెట్టఁబడక మఱియొక ఘనీభవపాత్రము (Condenser) నకుఁ గొనిపోఁబడుచుండును. ఇందువలన పనిచేసినపిమ్మట వ్యర్థముగా విడిచిపెట్టఁబడుచుండెడియావిరినంతను ఘనీభవింపఁ జేసి యావేడినీటిని తిరిగి బానకుఁ బంపుచుండుటచే బొగ్గువ్యయము చాలవఱకు తగ్గిపోవును. ఈఘనీభవపాత్రములను గూర్చి చెప్పవలసిన పెక్కువిషయము లెంతముఖ్యములైన నైనను ఈచిన్నపుస్తకమునందు స్థలము చాలకపోవుటచేఁ బ్రస్తుత మాప్రయత్నమును విడిచిపెట్టవలసి వచ్చినది.

కూజాయొక్క ప్రతిప్రక్కను, ఆవిరి యొకప్రక్కనుండి లోనికి వచ్చుచుండు నప్పుడు రెండవప్రక్కనుండునది వెలుపలకు పోవుచుండుటకును రెండవప్రక్కనుండి లోపలకు వచ్చుచుండునప్పుడు మొదటివైపుననుండునది వెలుపలకు తప్పించుకొని పోవుచుండుటకును దగినమార్గము లేర్పరుపఁబడియుండు నని యిదివఱకే చెప్పఁబడియున్నది. ఈమార్గముల వెంబడిని ఆవిరిని ఉచితసమయములను గ్రమముగా లోనికిఁ బోనిచ్చుటకును లోపల పనిచేసిన చల్లనియావిరిని వెలుపలకు విడిచిపెట్టుటకును సరియైనమూతలు (Valves) తగు యంత్రసాహాయ్యమున నేర్పరుపఁబడి యుండును. ఆవిరి యెంతవేడిగనుండిన నంతశక్తిని గలిగియుండుననియుఁ బనిచేసినపిమ్మటనది చల్లగా నుండుననియుఁ దెలిసికొనవలయును. పయిని చెప్పిన కప్పులు కూజాయొక్క యొక వైపుననుండి క్రొత్తయావిరిని లోనికి పోనిచ్చుచు రెండవవైపునుండి లోపల పనిచేసిన ప్రాతయావిరిని వెలుపలకు విడిచిపెట్టవలసిన తమవిధిని నెరవేర్చుటకు కావలసియుండు యంత్రపుటేర్పాటు ముందు వివరముగాఁ జెప్పఁబడును గావునఁ బ్రస్తుతము వానిపని నవి క్రమముగా నెరవేర్చుకొనుచు నేయున్నవని యూహింపవలసి యుండును.

కాఁబట్టి యిప్పుడు బాననుండి యావిరిని విడిచిపెట్టితిమేని యయ్యది ప్రక్క కప్పులవలన నుచితరీతినిఁ బ్రయోగింపఁబడి ప్రాథమికమండలమును గూజాలో నొక చివరనుండి రెండవచివర కెడతెగక నడుపుచుండునని మనము సులభముగా తెలిసికొనుచున్నాము.

ఇఁక ప్రాథమికమండలముమీఁదనే బరువునుంచి పైకెత్తించుటకు మాఱుగా నిచ్చట మఱికొంత యంత్రసముదాయమును గూడ జతపరుచుకొనిన యెడల నీప్రాథమిక మండలముయొక్క ఉద్యోలనుబోలియుండు గతాగత సంచారమువల్లనే ప్రపంచమునంగల సర్వకార్యములను జేయించుకొనవచ్చును. ఇందునకుఁగాను మనము ప్రాథ


మిక మండలముయొక్క మధ్యభాగమున నొక గుండ్రనిరంధ్రముఁ జేసి యందొక గుండ్రని యినుపకమ్మిని ముందు చెప్పఁబోయెడివిధమున జాగ్రతగా నమర్చవలసియుండును. ఈకమ్మి ప్రథమమండలపుకమ్మి (Piston Rod) యని పిలువఁబడును. ఈప్రథమ మండలపుకమ్మియొక్క యొకచివర ప్రాథమికమండలమునందే యమర్పఁబడి యుండుటచే రెండవచివర కూజాయొక్క యెదుటివైపున నుండుమూతమధ్యమునుండి వెలుపలకుఁ బోయియుండును. అందువలన నావెలుపలనుండు చివరకూడ ప్రాథమికమండలముతోడనే ముందునకును వెనుకకును తిన్ననిమార్గమున నడుచు చుండును. ఈతిన్నని నడక ముందు చెప్పఁబోయెడు మఱికొంత యంత్రసాహాయ్యమువలన వలయముగా మార్పఁబడు చుండుటచే ఇప్పు డది బరువును తిన్నగా పైకెత్తుటకు ఉపయోగపడుట మాత్రమే గాక ప్రపంచమునందలి మఱి యేయితరమైనపనినయినఁ గూడ నవిచ్ఛిన్నముగ నెరవేర్పఁగలిగి యుండును.

ఇంతవఱకు నీటికి ఉష్ణమును గలుగఁజేయుటవలన నావిరి పుట్టుచున్నదనియు నట్టియావిరికి కొంతబలముండు ననియుఁ గనుపరచుట మాత్రమే గాక యాయావిరిని బలముగా మార్చుటను గుఱించి కూడ కొంతవరకుఁ జెప్పఁబడినది. కావున నిఁకముందావిరియంత్రముయొక్క వివిధభాగములను వేరువేరుగ తీసికొని వానివాని నిజస్వరూపములను, నవిచేసెడు కార్యములను వివరముగా వివరింపఁ బడును. ఇందు ప్రథమమున నావిరియొక్క యుత్పన్న సాధనమగు నావిరిబానను గూర్చి తెలిసికొందము.

ఆవిరిబానల నిర్మించు విధము.

ఈయావిరిబాన లాయాకార్యముల ననుసరించి వేరువేరు విధములఁ దయారు చేయఁబడు చుండునని యిదివఱకే చెప్పఁబడియున్నది. అందొకటియు మిగుల సులభమగునదియు నగు నిలువుగొట్టముల ఆవిరిబాన (Vertical Tubuler Boiler) పయిపుటల ప్రక్క పటములయందుఁ గనుపరుపఁబడినది. ఇందలి రెండవబింబమువలన బానయొక్క బహిరాకారమును దెలిసికొన వచ్చును. ఈవెలుపలిగుల్ల యినుము లేక ఉక్కు రేకులను గుండ్రముగావంచి బానయొక్క విరివి ననుసరించి రెండు లేక మూఁడు రేకులను పటమునందుఁ జూపఁబడిన రీతిని తాపడముచేయుదురు. దీని యడుగుభాగమున బొగ్గు వేయుటకుఁ గాను గావలసియుండు ద్వారము ద్వా గుర్తుగా కనుపరుపఁబడినది. ఈ ద్వారమును బూర్ణముగా మూయఁగలిగిన యొకతలుపు ఇనుపరేకుతోడనే చేయఁబడి రెండుబందులు ఒకగడె మూలమున నీవెలుపలిగుల్లకు జతపరుపఁబడియుండును. ఈగుల్లయొక్క పైభాగమున నదే యినుములేక ఉక్కు రేకును గోళార్ధముగావంచి దీనితోఁ బట

మునందుఁ గనుపరుపఁ బడినరీతిని తాపడము చేయుదురు. ఈగోళార్ధమురొుక్క మధ్యభాగమున పొగగొట్టము నమర్చుటకుఁగాను ఒక తోల గొట్టఁబడియుండును. ఈతోలయందే యొక గుండ్రడముగా నుండు పలుచనియినుపరేకుగొట్టమును తాపడము చేయుదురు. గుల్లయొక్క యడుగుభాగము తెరువఁబడియే యుండునుగాని దీనియందు చుట్టును మాత్రము సమకోణము (L) గా వంచఁబడిన యొక యినుపకట్టు (Angle Iron) మాత్రము తాపడము చేయఁబడి యుండును.



2 వ బింబము.

ఇఁక నీగుల్లయొక్క లోపలియాకృతి 3 వ బింబమున కనుపరుపఁబడినది. ఇందు మ గుర్తుగలది పొయ్యి (Furnace) గది. ఈగది కడుగుభాగమున క గుర్తుగఁ గనుపరుపఁబడినవి బీటికమ్ములు. వీనిని పొయ్యికమ్ము (Fire Bars)లని పిలుతురు. ఈపొయ్యికమ్ముల చిత్రము పూర్ణముగా 4 వ బింబమునందుఁ గనుపరుపఁ బడినది. ఈచిత్రము మీఁదనే 2 వబింబమున ద్వా గుర్తుగాఁ గనుపరుపఁబడిన గుమ్మము వెంబడిని బొగ్గు వేయఁబడి రగులుకొని మండుచుండును. ఈమంటలు గొ గొ గొ గాఁ గనుపరుపఁబడిన గొట్టముల వెంబడిని పొ (బిం3) పొగగదికిపోయి యచ్చటనుండి పొగగొట్టముగుండ పొగయును, వేడివాయువులును బహిర్వాయువునకు పోవును. ఇందలి వెలుపలిగుల్లకును గొ గొ గొ గొట్టములకును పొయ్యి



3 వ బింబము.

యొక్క చుట్టు పైరేకులకును మధ్యభాగమున (……) చుక్క చుక్కలుగా కను పరచినచోట జల ముండును. ఇప్పుడుబానయొక్క లోపలిభాగమునఁగూడ నెక్క డెక్కడ నేయే వస్తువు లుండునో కొంతవఱకు తెలిసికొంటిమి గాన నిఁక వాని వాని నిర్మాణములనుగూర్చి యాలోచింతము.

4 వ బింబమునందును 3 వ బింబమున క గుర్తుగనునొక చిత్రము కనుపరుపఁ బడినది. ఈచిత్రమునందు కొన్ని టీటికమ్ములు ఒండొంటి మధ్య నరంగుళము మొదలు అంగుళము వఱకు నెడ ముండునటుల పరచఁబడియుండును. అందువలన నీచిత్రము పయిని కాలుచుండెడు బొగ్గుయొక్క నుసియును, బూడిదయును ఈసందుల వెంబ డిని అందు క్రిందనుండు బూడిదగుంటయందుపడిపోవుట మాత్రమేగాక యీసందుల నేర్పరచుటకు మఱియొక ముఖ్యమయిన కారణము కూడఁ గలదు. అగ్ని రాజుటకు ముఖ్యముగా వాయు వుండవలయుననుట యెల్లరకును తెలిసినవిషయమే! అట్టి వాయు వును మనము నోటితో నూదుటవలనఁ గాని మఱియొక యితరసాధనమువలనఁ గాని పంపఁబడవలసిన యావశ్యకము లేకుండఁగనే యిచట నిప్పు నుండుచుండెడు చిత్రము క్రింద నిట్టిసందుల నేర్పరచుట చేతనే వాయువు తనంతట తాను పొయ్యిలోనికి చొరఁబడి యుండుండెడు నగ్నిని భయంకరముగా మండించు చున్నది.

ఇట్టి యేర్పాటులు సామాన్యముగా మన వంటయిండ్ల నేర్పరచుకొనక పోవుట చేతనే మన స్త్రీలు పొయ్యిమండించుటకు మిక్కిలి శ్రమపడు చుందురు. కాని శ్వేత ముఖులు మాత్రము తమవంటయిండ్లయందుఁ దప్పక యిట్టి యేర్పాటునే యేర్పరచు కొను చుందురు. ఈయేర్పాటువలన వాయువు తనంతట తానుగనే పొయ్యిలోనికి జొచ్చుటకుఁ బ్రకృతిశాస్త్రి సమ్మతమగు కారణముమాత్రము లేకపోలేదు. ఆవిషయ మును ముందు పొగగొట్టములను గూర్చి వ్రాయుచోట వివరింపఁబడును గాన ప్రస్తుత మింతటితో విరమింతము.

దానిపయి పొయ్యియొక్క చుట్టురేకు బానయొక్క వెలుపలిగుల్లవలెనే యినుము లేక ఉక్కురేకును గుండ్రముగా వంచి తాపడము చేయుదురు. దీని పైభాగమును బూర్ణముగా నాక్రమించుకొనఁ గలిగియుండునటుల నొక దళసరి రేకును గుండ్ర ముగా తెగఁగొట్టి దానిచుట్టును నందునంచును పళ్లెమువలె వంపు పెట్టి యీలోపలి గుల్ల యనఁగా పొయ్యియొక్క చుట్టురేకులోనికిఁ బటమునందుఁ జూపఁబడిన రీతిని తాపడము పెట్టుదురు. ఈవిషయముల నెల్లను లెక్కకు మించినమాటలతోఁ బెంచి వ్రాయుట కన్నను ఇందు ప్రదర్శింపఁబడిన యాకారపటములఁ జూచుటవలననే చక్కఁగ గ్రహింపవచ్చును.

బాన వెలుపలిగుల్లయొక్క పైచివరను బొంగరదియొక్క గోళార్ధముగానుండు రేకు జతపరచు చోటనే పైపై యను నొక సరిమట్టముగానుండు రేకుకూడ నడ్డముగా వేసి శాపడము చేయఁబడియుండును. ఈపైపై రేకునందును కూడ సమదూరములయందు నుండునటుల కొన్ని గుండ్రనిరంధ్రములు చేయఁబడి యుండును. ఈ రంధ్రములయొక్క వ్యాసము (Diameter) అంగుళమున్నర మొదలు మూఁ డంగుళములవరకు ఆవిరిబానయొక్క విరివినిబట్టి మారుచుండును. ఈరంధ్రములగుండ ఇనుము, ఉక్కు, ఇత్తడులతోఁ జేయఁబడినగొట్టములు చొప్పింపఁబడి మిక్కిలి జాగ్రత్తతో శాపడము పెట్టఁబడి యుండును. ఈగొట్టములు సామాన్యముగా నాలుగయిదు గజ్జముల బలముగల యావిరిబానలకు ముప్పదివరకు వేయుచుందురు. ఈగొట్టములు ఇనుపగొట్టములుగాను, ఉక్కుగొట్టములుగానునుండుటకన్న నిత్తడిగొట్టములుగానుండిన యెడల యావిరి త్వరలో నుత్పత్తియగు చుండును. ధూమశకటములు మున్నగువాని యావిరిబానలకు ఒక్క యిత్తడిగొట్టములను వేయుటమాత్రమే గాక యావిరి మిక్కిలి త్వరగా నుత్పత్తియగు చుండుటకుఁగాను లోపలిగుల్ల యనఁగా పొయ్యియొక్క చుట్టు రేకుగూడ రాగిదే వేయుచుందురు. ఈగొట్టముల పద్ధతివలన నీటికి వేడిమితగిలెడి చోటు ఒక్కపొయ్యిచుట్టురేకులు పైరేకును మాత్రమేగాక గొట్టముల లోపలిభాగమంతయుకూడ అందులకు తోడుపడుచున్నది. ఇప్పుడు బానలో నుండునీటిమధ్యమునందంతటను అగ్నిజ్వాలలే యుండుటయు ఆయగ్నిజ్వాలలచుట్టును నీ రుండుటయు తటస్థించు చుండుటచే పుల్లకర్చు చాలవరకు తగ్గిపోవుట మాత్రమేగాక యావిరికూడ నతివేగమున నుత్పత్తియగు చుండును.

బానయందలి నీరు 3వ బింబమున ఈ (......) చుక్కలుగ గనుపరుపఁబడిన స్థానమునందంతటను ఉండును. ఇందునకు పైభాగ మనఁగా చుక్కలగుర్తులకును పైపై రేకునకును మధ్య నుండుస్థానమునందంతటను ఆవిరి కూడుకొనియుండును. ఒక్కొక్క సమయమున బానలో నుండుజలము తన నియమితస్థానమును మించి పైకివెచ్చి యావిరిస్థలమును తగ్గించుట వలన బాన కపాయము కలుగ కుండునటుల నందెంత వఱకు జల ముండునదియుఁ దెలిసికొనుటకుఁగాను జలప్రమాణప్రదర్శిక (Water-gauge) లొకటిగాని రెండుగాని 2వ బింబమున గ్ర గుర్తుగఁ జూపిన రీతిని నమర్పఁబడి యుండును. ఈబానయం దుత్పత్తియగుచుండెడు ఆవిరి యెప్పటి దప్పుడు యంత్రమునకుఁ బటమునందుఁ గొ గుర్తుగా (2వ బిం, గనపరచఁబడిన యావిరిగొట్టము మూలమునఁ బంపివేయఁబడు చుండును. బానయం దెంతయావిరి యుండునదియుఁ దెలిసికొనుటకు 2వ బింబమున సూ గుర్తుగఁ జూపినరీతి నొక బాష్పబలసూచిని (Steam-

gauge) యమర్చఁబడి యుండును. ఇఁక బానయం దుత్పత్తి యగుచుండెడి యావిరి ఎప్పటి దప్పుడు యంత్రమునలన వినియోగపర్చఁ బడక యొకానొక సమయమున బానయం దెక్కువయావిరి నిలువ యుండవలసి వచ్చినప్పుడు బాన కపాయము రాకుండు నటుల నియమితబలముకన్న ఎక్కువ యుండెడుఆవిరి నంతను వెలుపలకు విడిచిపెట్టుటకుఁగాను సంరక్షకకవాట (Safety valve) మనిపిలువఁబడెడు ఒక మార్గమునుఆమార్గమునకొక కప్పును చేర్పరచఁబడియుండును. ఈసంరక్షకకవాటముయొక్క నియమితబలము నప్పుడప్పుడు మనచిత్తవృత్తి ననుసరించి ఎక్కువతక్కువలను జేసికొను చుండవచ్చును. ఈసంరక్షకకవాటముయొక్కయాకారముగూడ 2 వ బింబమునందే బానపయిని కుడి పార్శ్వమున న గుర్తుగా కనుపరుపఁ బడినది. దీనియొక్కయు నింకను జలయంత్రాదికేతర భాగములయొక్కయు నిర్మాణప్రమాణాది సర్వవిషయములును వైయాధ్యాయములం దత్తదుచితస్థానముల యందుఁ జెప్పఁబడును.

ఆవిరియంత్రముల నిర్మించు విధము.

యంత్రములను బానలవలెనే పలువిధములఁ జేయఁబడు చుండును. యంత్రములోని కెల్లను ముఖ్యమయినభాగము కూజా. ఒక్క యంత్రమునందే యీకూజాలు ఒకటి, రెండు, మూఁడు, నాలుగు, వఱకును చేర్పరచు చుందురు. ఒక్క కూజాగల యంత్రమునం దెంతపని యుండునో నాలుగుకూజాలుగల యంత్రమునందుఁ గూడ కొంచె మించుమించు ఒక్కొక్క కూజాకును నంతపని యుండవలసి యుండును. ఇందు కొన్ని యధికబలము (High pressure) గల పనియుఁ గొన్ని యధికవేగము (High speed) గల పనియు నిట్లనేక భేదములను గలిగి యుండును. వాని భేదములెల్లను చేర్కొనుటకే ప్రత్యేకమింత పుస్తకము వ్రాయవలసి యుండునుగనుక నిప్పుడావిషయమున నేమియుఁ జెప్పక మనకర్తవ్యాంశమును మాత్రమే చూచు కొందము.

యంత్రములలోని కెల్లను మిక్కిలి సూక్ష్మముగా గ్రహియింపతగ్గది యొకకూజాగల యడ్డయంత్రము (Single Cylinder Horizantal Engine). అదియే యిచ్చట 5, 6, పటముల రెంటియందును రెండువిధములుగాఁ గనుపరుపఁబడినది. ఇందు 5వ పటమున యంత్రముయొక్క వెలుపలియాకారము నొకప్రక్కగా నిలుచుండి చూచునపుడు కానిపించురూపము కనుపరుపఁబడినది. ఈవెలుపలిస్వరూపమె యంత్రమున కెదురుగా నిలుచుండి చూచునపుడు కానిపించురీతి 6 వ పటమునందుఁ జూపఁబడినది. ఈ 6 వ పటమునందే కూజాయొక్క లోనియాకృతికూడఁ గనుపరుపఁబడినది.

ప్రకటన.

ఇప్పుడు సంపుటములుగా ముద్రింపఁబడుచున్న రావుబహదూరు కందుకూరి వీరేశలింగముపంతులుగారి పుస్తకములలో మూఁడుసంపుటములు విక్రయమునకు సిద్ధముగానున్నవి. దళమైన కాగితములమీఁద ముద్రింపఁబడి, గిల్టక్షరములు వేసి కాలికోగుడ్డతో బైండుచేయఁబడినవి అంచెకూలిగాక మొదటిసంపుటము వెల రు 3-0-0 లు; రెండవసంపుటము వెల రు 3 - 0 - 0 లు; అయిదవసంపుటము వెల రు 3-8-0 లు. కాలికో గుడ్డతో బైండుచేయఁబడిన పలుచని కాగితములవి మొదటిసంపుటము వెల రు 2-8-0 లు; రెండవసంపుటము వెల రు 2 - 8 - 0; అయిదవ సంపుటము వెల రు 3 - 0 - 0 లు. ఇందు మొదటిసంపుటములో ఈపట్టికలోని 11, 12, 13, 14, 15, 16, 20, 24, 25, 26, 27, 28, 29, 30, 31, 32, 33, సంఖ్యలపుస్తకములుచేరియున్నవి; రెండవసంపుటములో 7, 9, 10, 17, 18, 21, 22, 23, సంఖ్యలపుస్తకములుచేరియున్నవి; అయిదవ సంపుటములో 44, 45, 46, 49, 50, 51, 52, 53, 54, 55, 56, 57, 58, 59, 60, 61, 62, 63, 64, సంఖ్యలపుస్తకములుచేరియున్నవి. మూఁడవ సంపుట మీనెలకడపట ముగియును. అందు 1, 2, 3, 4, 5, 6, 8, 19 సంఖ్యలపుస్తకములుండును.

IMPORTANT NOTICE.

విజ్ఞాపనము.

ఆంధ్రభాషాభిమానులగు సుహృదులారా!

నాపుస్తకముల నన్నిటిని క్రొత్తయక్షరములతో మంచి కాగితములమీఁద సంపుటములుగా నచ్చువేయించుచున్నాను. ఇట్టిపనిని నిర్వ

హించుట విశేషధనసాధ్యమన్నయంశ మెల్ల వారికిని విశదమయియున్నది. ఇప్పు డున్న ప్రకారముగా నాపుస్తకము లన్నిటియొక్కయు వెలలు దాదాపుగా ముప్పదిరూపాయలవఱకు నగునని యీపుస్తకముల పట్టికను జూచువారి కెల్లరకు స్పష్టమగును. ఇప్పుడొక్కసారిగా నిరువది రూపాయలను దయచేయు వారికి మంచిదళమైన నునుపుకాకితముల మీఁద నచ్చువేయఁబడి, గిల్టక్షరములు వేసి కాలికోగుడ్డతో పూర్ణముగా బైండుచేయఁబడిన సంపుటములన్నియు నియ్యఁబడును. ఈసంపుటములలో నిప్పుడున్న పుస్తకములు మాత్రమేకాక యీపనిముగియులోపలఁ జేయఁబడు నూతనపుస్తకములును జేరియుండును. పూర్తిగాముద్రింపఁబడిన తరువాత నీసంపుటముల వెల ముప్పదిరూపాయలుండును. ఈదళమైన కాగితములతో వేయఁబడు ప్రతులుగాక పలుచని కాగితములతో సహితము వేఱుగా సంపుటములు వేయఁబడుచున్నవి. ఇప్పుడొక్కసారిగా పదునేనురూపాయల నిచ్చువారికి పలుచని కాగితములమీఁద ముద్రింపఁబడి కాలికోగుడ్డతో బైండుచేయఁబడిన యీసంపుటములన్నియు నియ్యఁబడును. పూర్ణముగా ముద్రింపఁబడిన తరువాత నీసంపుటముల వెల యిరువదిరూపాలుండును. టపాకర్చులను పుస్తకములనుగొనువారే భరింపవలయును. ఈప్రకారముగా ముందుగా సొమ్మిచ్చు భాషాభిమానులు తాము లాభమునుబొందుటయేకాక నాకును సహాయముచేసిన వారగుదురు. కాఁబట్టి దేశభాషాభిమానమాననీయులగు మహనీయులందఱును నాకీవిధముగా తోడ్పడుదురని వారిని వినయపూర్వకముగాఁ బ్రార్థించుచున్నాను. ఇప్పుడు విడివిడిగానున్న పుస్తకముల నన్నిటినొక్కసారిగా మొత్తముగాఁగొనువారి కంచెకూలిగాక పదునేనురూపాయలకే యన్ని పుస్తకములు నియ్యఁబడును. నాచేరచియింపఁబడినవిగాక నాచేముద్రింపఁబడి యీపట్టికలోఁజేరియున్న యితరపుస్తకములనుగూడ నపేక్షించువా రిరువదిరూపాయలను బంపవలెను. పయిని వివరింపఁబడిన తక్కువ వెలలకు పుస్తకము లీసంవత్సరము డిసెంబరునెల ముగియులోపల సొమ్ము

సంపువారికిమాత్రమే యియ్యఁబడును. ఈవఱకాగస్టునెల కడపటి వఱకుమాత్రమే సంపుటములను తక్కువవెలల కిచ్చుట కేర్పాటుచేయఁబడినను, కొందఱాకాలములోపలఁ దమకుఁ బ్రకటనపత్రికలే చేరలేదనియు గడువుహెచ్చింపవలయుననియుఁ గోరుచున్నందున డిసెంబరునెల కడవఱకును కాలము పెంపుచేయఁబడినది. అప్పటికించుమించుగా నేనూఱేసి పుటలుగల యైదువాల్యూములు సిద్ధమగును. ఇప్పుడు మూఁడు సంపుటములు విక్రయమునకు సిద్ధముగానున్నవి. ఒక్కొక్కవాల్యూము సిద్ధము కాఁగానే చందాదారుల కెప్పటికప్పు డావాల్యూము పంపఁబడుచుండును. ఇష్టమున్నవారు ముందుగాఁ దెలిపినచో నయినవాల్యూములను (V.P.P.) వాల్యూ పేయేబిలుగాఁ బంపి సొమ్మువసూలు చేయఁబడును. ఇందలి పుస్తకములలో పెద్దవాని నొకటి రెంటిమూఁటినిగాని, చిన్నపుస్తకములను పెక్కింటినిగాని, చేర్చి కాలికోగుడ్డతో బైండుచేయించి పంపఁగోరెడుపక్షమున నాలుగేసియణా లధికముగాఁ బంపవలయును.

పుస్తకములనుగోరువారు చెన్నపట్టణము, పరశువాకము, ఆదియప్పమొదలివీధి ౪ నెం. గృహమునస్థాపింపఁబడియున్న శ్రీ చింతామణి ముద్రాక్షరశాల మేనేజరుగారికి వ్రాసి పుస్తకములను దెప్పించుకొనవలెను.

రు ౦-౮-౦ లు లోపు వెలగల పుస్తకములు కోరువారు వీ. పీ. గాఁగోరక టపాబిళ్లలనుబంపుట మంచిది.

20. వెల్లాళవీధి.
పరశువాకము, చెన్నపురి.
౧ అక్టోబరు ౧౮౯౮ వ సం.

ఇట్లు,
విన్నవించువిధేయుఁడు.
కందుకూరి వీరేశలింగము.

శ్రీ చింతామణీ ముద్రాక్షరశాలలో వెలకుదొరకు పుస్తకములు.

రావుబహాదూరు కందుకూరి-వీరేశలింగముగారిచే రచియింపఁబడినవి.

నాటకములు. (అంచెకూలితో)	రు.	అ.	పై.
౧. అభిజ్ఞాన శాకుంతలము-(కాళిదాసుని నాటకమునకు తెలుఁగు)	౦	౧౩	౦
౨. రత్నావళి (శ్రీహర్ష దేవవిరచిత సంస్కృత నాటకమునకు తెలుఁగు)	౦	౬	౬
౩. మాళవికాగ్నిమిత్రము-(కాళిదాసప్రణీత నాటకమునకు తెలుఁగు)	౦	౬	౬
౪. ప్రబోధచంద్రోదయము- (కృష్ణమిశ్రుని నాటకమునకు తెలుఁగు)	౦	౮	౬
౫. రాగమంజరి- (ఇంగ్లీషునను సరించి తెలిఁగింపఁబడిన నాటకము)	౦	౮	౬
౬. కళ్యాణకల్పవల్లి-(96 పుటలుగల మిక్కిలిరమ్యమైన నాటకము)	౦	౮	౬
౭. ప్రహ్లాదనాటకము- (భక్తిప్రధానమైన వచనరూప నాటకము)	౦	౪	౬
౮. చమత్కారరత్నావళి నాటకము	౦	౪	౬
౯. బ్రాహ్మవివాహము	౦	౩	౬
౧౦. వ్యవహారధర్మబోధిని.	౦	౩	౬
౧౧. వేశ్యాప్రియ ప్రహసనము.	౦	౩	౬
౧౨. కౌతుకవర్ధని- (హాస్యప్రధానమయిన చిన్న నాటకము). ...	౦	౨	౬
౧౩. వినోదతరంగిణి.	౦	౨	౦
౧౪. హాస్యసంజీవని, మొదటిభాగము,...	౦	౪	౬
౧౫. హాస్యసంజీవని, రెండవభాగము.	౦	౪	౬
౧౬. హాస్యసంజీవని, మూడవభాగము...	౦	౪	౬
౧౭. తిర్యగ్విద్వన్మహాసభ, మూషకాసురవిజయము-బొమ్మలతో నున్నది.	౦	౨	౬
౧౮. మహారణ్యపురాధిపత్యము- (బొమ్మలతో నున్నది). ...	౦	౩	౬
౧౯. విస్మయవర్తకచరిత్రము (ద్విపద ప్రథమ ద్వితీయాంకములు) ...	౦	౪	౬
౨౦. కలిపురుష శనైశ్చరవిలాసము.	౦	౨	౦
౨౧. వివేకదీపిక-(స్త్రీ పునర్వివాహ నాటకము మొదటిమూడంకములు.)	౦	౪	౬
౨౨. సత్యహరిశ్చంద్ర నాటకము.	౦	౮	౬
౨౩. దక్షిణగోగ్రహణ నాటకము.	౦	౬	౬
ఇంగ్లీషునను సరించిన ప్రహసనములు.			
౨౪. అపూర్వబ్రహ్మచర్య ప్రహసనము.	౦	౨	౬
౨౫. విచిత్రవివాహ ప్రహసనము.	౦	౨	౬

౨౬. మహాబధిర ప్రహసనము.	౦	౨	౬
౨౭. పునర్వరణ ప్రహసనము.	౦	౨	౬
౨౮. బలాత్కార గానవినోద ప్రహసనము.	౦	౨	౬
౨౯. కలహప్రియా ప్రహసనము.	౦	౨	౬
౩౦. మహామహోపాధ్యాయ ప్రహసనము.	౦	౨	౬
౩౧. రోగనిద్రా ప్రహసనము.	౦	౨	౬
౩౨. మహావంచక ప్రహసనము.	౦	౨	౬
౩౩. అసహాయశూర ప్రహసనము.	౦	౨	౬

పద్య కావ్యములు.

౩౪. అభాగ్యోపాఖ్యానము-(పద్యరూపముననున్న హాస్యప్రబంధము.)	౦	౨	౦
౩౫. శుద్ధాంధ్రనిరోష్ఠ్య నిర్వచన నైషధము (అచ్చతెలుఁగు) ...	౦	౪	౬
౩౬. రసికజనమనోరంజనము-(అచ్చతెలుఁగు శృంగారప్రబంధము.)	౦	౬	౬
౩౭. శుద్ధాంధ్ర భారతసంగ్రహము.	౦	౬	౬
౩౮. పథిక విలాసము.	౦	౪	౬
౩౯. జార్జ్ గిల్బర్ట్ తేటగీతములు.	౦	౧	౬
౪౦. నీతిదీపిక-(బాలురనిమిత్తముచేయఁబడిన నీతిపద్యములపుస్తకము)	౦	౨	౬

స్త్రీలకుపయోగపడు పుస్తకములు.

౪౧. స్త్రీనీతిదీపిక-(బాలికలనిమిత్తముచేయఁబడిన నీతిపద్యములు)	౦	౨	౬
౪౨. పత్నీహితసూచని.	౦	౬	౬
౪౩. సతీహిత బోధిని.	౦	౬	౬
౪౪. చంద్రమతీచరిత్ర-(స్త్రీలకుపయుక్తమయిననీతిబోధక పుస్తకము)	౦	౪	౬
౪౫. సత్యవతీచరిత్ర-(స్త్రీలకావశ్యకమయినచరిత్ర) ...	౦	౪	౬
౪౬. సత్యసంజీవని-(స్త్రీలకుపయోగించెడు నీతిబోధకమయినకథ).	౦	౪	౬
౪౭. సత్యాద్రౌపదీ సంవాదము, మాతృపూజ, పితృపూజ. ...	౦	౧	౬
౪౮. దేహారోగ్యధర్మబోధిని-శరీరారోగ్యధర్మములబోధించుపుస్తకము.	౦	౪	౬

షేక్స్పియరు నాటకకథల ననుసరించి వ్రాయఁబడినకథలు.

౪౯. చమత్కార రత్నావళి.	౦	౨	౬
౫౦. కురంగేశ్వరవర్తక చరిత్రము.	౦	౨	౬
౫౧. కళావతీ పరిణయము.	౦	౨	౦
౫౨. గయ్యాళిని సాదుచేయుట.	౦	౨	౦
౫౩. రఘుదేవరాజీయము.	౦	౩	౦

౮౫. మానవధర్మము.	౦	౨	౦
౮౬. విద్యార్థికుల ధర్మములు.	౦	౨	౬
౮౭. వర్ణము.	౦	౨	౬
౮౮. మనుష్యజీవితముయొక్క పరమార్థము, దానినిపొందుమార్గము.	౦	౨	౬
౮౯. వైరాగ్యము.	౦	౨	౦
౯౦. విద్యాధురీణుల యవశ్యకృత్యములు.	౦	౨	౬

వివిధ పుస్తకములు.

౯౧. జ్యోతిశ్శాస్త్రసంగ్రహము ౧౨౦ పుటలుగలదిపటములతో నున్నది.	౧	౨	౦
౯౨. శారీరశాస్త్రసంగ్రహము.	౧	౨	౦
౯౩. జంతుస్వభావచరిత్రము.	౦	౧౧	౦
౯౪. ఆంధ్రకవులచరిత్రము, మొదటిభాగము-౧౫౦ పుటలుగలది ...	౧	౨	౦
౯౫. ఆంధ్రకవులచరిత్రము, ద్వితీయభాగము - ౧౯౪ పుటలుగది ...	౧	౨	౦
౯౬. ఆంధ్రకవుల చరిత్రము, తృతీయభాగము.	౧	౬	౦
౯౭. వివేకవర్ధని, మొదటిభాగము.	౦	౬	౬
౯౮. వివేకవర్ధని, రెండవభాగము.	౦	౬	౬
౯౯. వివేకవర్ధని, మూడవభాగము.	౦	౯	౦
౧౦౦. స్వదేశసంస్థాన చరిత్రాదులు.	౦	౬	౬
౧౦౧. ఉపన్యాసమంజరి.	౦	౬	౬
౧౦౨. ఆంధ్రతర్క సంగ్రహము.	౦	౧	౬
౧౦౩. సంగ్రహవ్యాకరణము.	౦	౫	౬
౧౦౪. కావ్యసంగ్రహము.	౦	౨	౦
౧౦౫. నీతికథామంజరి- ప్రథమభాగము (పటములతో) ...	౦	౯	౦
౧౦౬. నీతికథామంజరి- ద్వితీయభాగము (పటములతో) ...	౦	౯	౦
౧౦౭. నీతిచంద్రిక విగ్రహము.	౦	౧౨	౬
౧౦౮. నీతిచంద్రిక సంధి.	౦	౬	౬
౧౦౯. రాజశేఖర చరిత్రము.	౧	౨	౦
౧౧౦. సత్యరాజాపూర్వ దేశయాత్రలు మొదటిభాగము. ...	౦	౬	౬
౧౧౧. సత్యరాజాపూర్వ దేశయాత్రలు రెండవభాగము. ...	౦	౬	౬
౧౧౨. శ్రీ విక్టోరియా మహారాజ్ఞీగారి చరిత్రము. ...	౦	౬	౬

పూర్వకవిప్రణీత గ్రంథములు.

౧. కవిరాజమనోరంజనము- (పురూరవశ్చరిత్ర)	౦	౯	౦
౨. మొల్లరామాయణము.	౦	౧౧	౦

౩. ప్రభావతీ ప్రద్యుమ్నము.	౦	౧౩	౦
౪. పాంచాలీ పరిణయము.	౦	౬	౬
౫. రామాభ్యుదయము.	౧	౬	౦
౬. యయాతి చరిత్రము.	౦	౬	౬
౭. విజ్ఞానేశ్వరము- (పద్యకావ్యము త్రికాండములు.) ...	౦	౫	౬
౮. అథర్వణకారికలు.	౦	౭	౬
౯. ఉత్తరహరివంశము-(నాచనసోమనాథకవి ప్రణీతము.) ...	౧	౬	౦
౧౦. చిత్రభారతము.	౧	౬	౦
౧౧. పంచతంత్రము (నారాయణకవికృతము).	౦	౧౩	౦

పదిరూపాయలకంటె తక్కువకాని మొత్తమునకు పుస్తకములు కొన్నపక్షమున నూటికి పదిరూపాయలవంతున పుస్తకము లధికముగా నియ్యఁబడును. పుస్తకము లన్నియు మొత్తముగా నొకసారి కొనినయెడల పోస్టుకర్చులుగాక ఇరువది రూపాయలకే యియ్యఁబడును.

ఈక్రింది పుస్తకములు గిల్టక్షరములువేసి కాలికోగుడ్డతో నిండుగాబయిండు చేయఁబడినవి యీదిగువవెలలకు దొరకును.—(అంచెకూలితో.)

	రు.	అ.	పై.
సీతకథామంజరి. (రెండుభాగములునుగలిసి).	౧	౪	౦
శారీరశాస్త్రిసంగ్రహము.	౧	౪	౦
జ్యోతిశ్శాస్త్రి సంగ్రహము.	౧	౪	౦
జంతుస్వభావచరిత్రము.	౦	౧౪	౦
విక్టోరియా మహారాజ్ఞిచరిత్రము (20 పటములతో) పెద్దక్షరములది.	౦	౧౩	౦

గిల్టక్షరములులేక కాలికోగుడ్డతో బైండుచేయఁబడినవి.

చిత్రభారతము.	౧	౮	౦
మొల్లరామాయణము.	౦	౧౩	౦
సత్యవతీ చరిత్రము.	౦	౨	౦
కవులచరిత్రము మూడుభాగములు కలిసినది.	౩	౮	౦
నాచనసోముని ఉత్తరహరివంశము	౧	౮	౦
కవులచరిత్రము మూడవభాగము	౧	౮	౦

☞ పయిపుస్తకములు కావలసినవారు, చెన్నపట్టణము, పరశువాకము, అదియప్పమొదలివీధి, ౪ నంబరు గృహమున శ్రీ చింతామణి ముద్రాక్షరశాల మేనేజరు గారికి వ్రాసి తెప్పించుకొనవచ్చును.